
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.5
కనిష్ఠం 23.4
****

ANDHRAJYOTHY



నల్లగొండ

5 బుధవారం 10 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.10 (309.3558)	70,769	70,769
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,424.06	1,711.69
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.423 (43.3532)	45,230	45,985

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

మార్పు తెప్పించిన మాటలు

సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన శ్రీనివాస్ అనే ఓ వ్యక్తి పలు వ్యాపారాలు చేశాడు. ఇందుకోసం అప్పులు తెచ్చాడు. వ్యాపారాల్లో నష్టం రావడంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. అందుకోసం క్రిమిసంహారక మందు తెచ్చుకున్నాడు. ఆ సమయంలో అతడి శ్రీనివా స్ మిత్రుడు వెంకన్న అతడి ప్రవర్తనను గమనించి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రశ్నించాడు. దీంతో తన బాధను పంచుకోవడంతో పాటు క్రిమిసంహారక మందు డబ్బాను చూపించాడు. శ్రీనివాస్‌ను ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లిన వెంకన్న సమస్యకు చావు పరిష్కారం కాదని, అప్పులను దశల వారీగా తీర్చుకోవాలని సూచించాడు. తననే నమ్ముకున్న కుటుంబాన్ని వదిలి వెళ్లాలనుకోవడం సరికాద ని, మంచి మాట లు చెప్పి అతడిలో ధైర్యాన్ని నింపాడు. దీంతో ఆత్మహత్య ఆలోచనను విరమించుకున్న శ్రీనివా స్ వ్యాపారాన్ని వృద్ధి చేసుకొని అప్పులు తీర్చుకుంటూ నేడు హాయిగా జీవిస్తున్నాడు. మిత్రుడు చెప్పిన మాటలు శ్రీనివాస్‌లో మార్పు తీసుకువచ్చాయి.



» ఆత్మహత్య వద్దు, ఆత్మస్థైర్యమే ముద్దు!

చచ్చి ఏం సాధిస్తాం



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇటీవల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. చిన్నచిన్న కారణాలకే ప్రాణాలను వదిలేస్తున్నారు. ఆర్థిక కారణాలతో పెద్దలు, ప్రేమ పేరుతో యువకులు బలవన్మరణాలను ఎంచుకుంటున్నారు. క్షణికావేశం, సమస్యలను ఎదుర్కొనే ఆలోచన నుంచి తప్పించుకునే క్రమంలో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఆందోళన, అవగాహన లోపంతో అనేకమంది మృత్యు మార్గాన్ని ఎంచుకుంటున్నారు. సమస్యలు తానొక్కడికే లేవని గుర్తించి అటుగా ఆలోచిస్తే జీవితం సుగమం అవుతుందని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. ఏ సమస్యలకైనా చావు పరిష్కారం కాదని, అలా అయితే సమాజంలో మిగిలేది సమాధులే అన్న సత్యాన్ని గుర్తించాలంటున్నారు. ఓటమి అనే సంద్రం నుంచి విజయ తీరా లకుచేరిన వారి కష్టాల కడలి పోరాటాన్ని తెలుసుకోవాలంటు న్నారు. రేపు అనేది మనదే అన్న ధీమాతో ఉండాలని, ఆ క్రమంలో ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏ సమస్యనైనా దీటుగా ఎదుర్కొనవచ్చని, చచ్చి కాదు, బతికి సాధించాలన్న తపనను మనలో పెంచుకోవాలని సూచిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి, సూర్యాపేట క్రైం)

• 6, 7లో..

కవి మాట....

మరణం వరించి వస్తే రమ్మంటాను....పాలుతాపి బజ్జోమంటాను అన్నాడు కవి డాక్టర్ సి.నారాయణ రెడ్డి. ఆత్మవిశ్వాసం ఉన్న మనిషి మృత్యువును ధీశక్తితో ఎదుర్కొంటే, అది లోపించిన మనిషి చావుకు భయపడతాడు.

సూర్యాపేట జిల్లాలో మూడేళ్లలో..

ఏడాది	ఆత్మహత్యలు
2023	141
2024	175
ఈ ఏడాది ఆగస్టు వరకు	115
మొత్తం	431

(ఈ ఏడాది జరిగిన సంఘటనల్లో 115 మంది ఆత్మహత్యలకు పాల్పడగా అందులో పురుషులు 54 మంది, మహిళలు 43 మంది, యువత 18 మంది ఉన్నారు.)



153 రోజుల్లో 158 కోట్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాల ఆదాయం స్వల్పంగా పెరిగింది. అయితే రిజిస్ట్రేషన్ల తగ్గగా, ప్రభుత్వం భూముల విలువ పెంచడంతో ఆర్థికంగా కొంత పుంజుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు మొత్తం 153 రోజుల్లో రూ.158కోట్లకు పైగా రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం సమకూరింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

» స్వల్పంగా పెరిగిన రిజిస్ట్రేషన్లశాఖ ఆదాయం
» మందకొడిగా రియల్ వ్యాపారం
» ఈ ఏడాది ఆగస్టు వరకు రూ.158 కోట్లకు పైగా ఆదాయం

ఉమ్మడి జిల్లాలో రియల్ వ్యాపారం కొంత మందగించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 1,43,426 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరగ్గా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,38,729 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ మాత్రమే జరిగింది. అంటే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,699 డాక్యుమెంట్లు తక్కువగా రిజిస్ట్రేషన్ అయ్యాయి. దీం తో ఆదాయం స్వల్పంగా పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.412,36,58,581 ఆదాయం రాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.419,48,68,998 సమకూరింది. పెద్దగా ఖజానా నిండకపోయినా, గతంతో పోలిస్తే రూ.7,12,10,417 అదనపు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అత్యధికంగా...

- మిగతా 7వ పేజీలో...

అరకొరగానే ఆస్తుల క్రయవిక్రయాలు

ఉమ్మడి జిల్లాలో ఆస్తుల క్రయవిక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. వెంచర్లకు అన్ని అనుమతులు ఉన్నాయా? చెరువు శిఖాల్లో ఉన్నాయా? ప్రభుత్వ భూమినా? అసైన్డ్ భూమిలో వెంచర్లు ఏర్పాటు చేశారా? అని ప్రజల ఒకటికి రెండ్లు సార్లు విచారించి ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. ఇంటి స్థలాలు, అపార్ట్‌మెంట్ల ధరలు పెరిగాయి. దీంతో కూడా కొనుగోళ్లపై కొంత ప్రభావం కనిపిస్తోంది. ప్రభుత్వం మార్కెట్ ధరను కూడా పెంచింది. దీంతో స్టాంప్ డ్యూటీ పెరిగింది. ఈ నేపథ్యంలో ఆస్తుల కొనుగోలుదారులు కొనుగోళ్లకు, రిజిస్ట్రేషన్లకు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు కొనుగోళ్ల పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. లేఅవుట్లు సక్రమమా? అక్రమమా? అని అధికారులు నిర్ధారిస్తే రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ప్రజలకు పూర్తిస్థాయి నమ్మకం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం మరోమారు భూముల విలువలను పెంచే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు మార్గదర్శకాలు రాలేదని అధికారులు తెలిపారు. ఎనిమిది నెలల క్రితం వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్దగా లేకపోవడం ఆస్తుల క్రయవిక్రయాలపై ప్రభావం చూపింది. కరువు కూడా తోడవడంతో ప్రజల వద్ద డబ్బు లేక రియల్ వ్యాపారం దెబ్బతిన్నది. అయితే ప్రభుత్వం ఆ తరువాత 25శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించడంతో చాలా మంది దీన్ని వినియోగించుకున్నారు. ఎల్ఆర్ఎస్ కారణంగా స్టాంపు డ్యూటీతో సంబంధిత శాఖకు కొంత కలిసి వచ్చింది.

పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పారదర్శకంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నాం. ఎలాంటి అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా జవాబుదారీతనంతో ఉండేలా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఎవరు కూడా మధ్యవర్తులను ఆశ్రయించకుండా సంబంధిత కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయించుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం ఉంది. ఎవరికీ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు స్లాట్ బుకింగ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. సకాలంలో రిజిస్ట్రేషన్లు పూర్తి అవుతున్నాయి.

- ఎస్.ప్రకాశ్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

సొసైటీల రద్దులో రాజకీయ కోణం!

» బీఆర్ఎస్ నేతలు ఉన్న సొసైటీలను లక్ష్యంగా చేస్తున్నారని ఆరోపణలు
» సహకారశాఖ అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
» డిఫాల్టర్లపై దృష్టి సారించడం లేదన్న మాజీ చైర్మన్లు
» కోర్టు ఆశ్రయించనున్నట్టు సమాచారం
» డీసీసీబీ డైరెక్టర్లకు రాని అనుమతులు



నల్లగొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాల కాలపరిమితిని పొడిగించే విషయంలో పలు తిరకాసులు పెట్టడంతో రాజకీయ రచ్చ కొనసాగుతోంది. రాష్ట్రంలో మిగతా ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ల మాదిరిగానే ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌కు చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సొసైటీకి మాత్రమే పాలకవర్గ గడువును ప్రభుత్వం పెంచింది. మిగతా సొసైటీల విషయాన్ని డైలమాలో పెట్టింది. ఇటీవల జిల్లా సహకార శాఖ అధికారులు మూడు జిల్లాల్లో డీఫాల్టర్ సొసైటీల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. అయితే ప్రభుత్వం అనుమతిచ్చిన సొసైటీల చైర్మన్‌లను కొనసాగిస్తుండగా, మిగతా సొసైటీలకు నేడో, రేపో ప్రత్యేకాధికారులను నియమించే పనిలో డీసీవోలు ఉన్నారు. గతంలో జిల్లా సహకార ఎన్నికలు జరిగిన సమయంలో మూడు జిల్లాలోనూ అత్యధికంగా బీఆర్ఎస్ నేతలు కైవసం చేసుకున్న సొసైటీలు ఉన్నాయి. క్రమంగా చాలా సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లు అధికార పార్టీలో చేరారు. కొందరు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డీఫాల్టర్ల సొసైటీలను పరిశీలిస్తున్న డీసీవోలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్టు ఆయా సొసైటీల మాజీ చైర్మన్లు ఆరోపిస్తున్నారు.

డీసీవోలపై కొందరు ఎమ్మెల్యేల ఒత్తిళ్లు?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొన్ని సొసైటీలను కాపాడటం, మరికొన్ని సొసైటీలను రద్దు చేయించడం కోసం కొందరూ ఎమ్మెల్యేలు జిల్లా సహకార అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో డీసీవోలు డీఫాల్టర్ సొసైటీలను నిర్ణయించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిసింది. ప్రభుత్వ ఆదేశాలను సాకుగా చూపి ఒకరిద్దరూ డీసీవోలు ఏకంగా వారికి నచ్చని సొసైటీలపై ఏదో కారణం చూపి స్పెషల్ ఆఫీసర్లను నియమించే పనిలో ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో చాలా మంది సొసైటీల మాజీ చైర్మన్లు కోర్టును ఆశ్రయించేందుకు నిర్ణయించినట్టు సమాచారం. వీరంతా కోర్టులో పిల్ వేయనున్నట్టు వినికిడి. అదేవిధంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకులోని డైరెక్టర్ల కొనసాగింపునకు ఇప్పటి వరకు ఎలాంటి అనుమతి రాలేదు. వారంతా మాజీలుగానే ఉండిపోయారు. 18మంది వరకు డీసీసీబీ డైరెక్టర్లు మాజీలు కావడంతో వారందరిని ఎప్పుడు బాధ్యతల్లో కొనసాగిస్తారో తెలియని పరిస్థితి ఉంది. ఆగస్టు 14వ తేదీ నుంచి బాధ్యతలు ఇస్తూ పాలకవర్గాల గడువు పెంచినా ఇప్పటి వరకు వారికి చార్జ్ ఇవ్వకపోవడంతో పాటు చెక్‌పవర్‌ను కూడా నిలిపివేశారు. దీంతో వారంతా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పాలకవర్గాల..

- మిగతా 8వ పేజీలో...



స్నాతకోత్సవానికి సన్నాహాలు

» ఏ - ప్లస్ గ్రేడ్ వైపు ఎంజీయూ అడుగులు
» 2028 న్యాక్ అక్రెడిటేషన్ గుర్తింపే లక్ష్యంగా ప్రణాళికలు

7

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు

పూర్తి చేస్తాం

» మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి » జలసౌధలో సమీక్షా సమావేశం
» పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా, మంత్రి కోమటిరెడ్డి



జలసౌధలో జరిగిన సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ సాగునీటి ప్రాజెక్టులను 2027 నాటికి పూర్తిచేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను 2027 నాటి వరకు పూర్తిచేస్తామని, అందుకు ఇరిగేషన్ అధికారులు పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాగునీటి పారుదలశాఖ మంత్రి కావడంతో జిల్లాకు మంచి రోజులు వచ్చాయని అన్నారు. అందుకే జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పనులన్నీ వేగవంతం అయ్యాయని అన్నారు. 2027 నాటికి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. గత పదేళ్ల కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును బీఆర్ఎస్ పక్కన పెట్టిందని ఆరోపించారు. సాగర్ బ్యాక్ వాటర్ విలువైనదని, ఈ నీరు ఎడమకాల్వ చివరి వరకు అందేలా లైనింగ్ పనుల కోసం టెండర్లు పూర్తిచేసినందుకు మంత్రి ఉత్తమ్‌కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో కట్టంగూరు, మునుగోడు, నార్కట్‌పల్లి మండలాల్లో వర్షాలు అతి తక్కువగా పడ్డాయని, దీంతో తాగునీటి సమస్య ఉందన్నారు. రైతులకు సాగునీరు అందించాలని పైపులైన్ కోసం తాను సొంతంగా రూ.30లక్షలు ఖర్చు చేశానని, ప్రభుత్వం రూ.300కోట్లు కేటాయిస్తే బ్రాహ్మణ వెల్లెంల నుంచి నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయవచ్చని అన్నారు. సాగునీటి బడ్జెట్‌లో 10శాతం నిధులు సుమారు రూ.3వేల కోట్లు ఖర్చు చేస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయని, అందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి వెంకట్‌రెడ్డి కోరారు.

జీవితాన్ని తెలంగాణకు అంకితం చేసిన ప్రజాకవి కాళోజీ

ఇన్‌చార్జి డీఆర్వో అశోక్‌రెడ్డి



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి డీఆర్వో అశోక్‌రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవితాన్ని తెలంగాణకు అంకితం చేసిన మహనీయుడు ప్రజాకవి కాళోజీ నారాయణ రావు అని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి, నల్లగొండ ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో కాళోజీ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు తన రచనల ద్వారా నిజాం నిరంకుశ పాలనను, దమన నీతిని ఎండగట్టారన్నారు. నిజాం రజాకార్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వతంత్ర్య సమరయోధుడు అని కొనియాడారు. అలాంటి మహనుభావుడి జయంతిని ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, ఆయా విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాలలో..

తెలంగాణ భాషా దినోత్సవాన్ని మంగళవారం నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన తెలుగు శాఖ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అక్షరాన్ని ఆయుధంగా చేసుకొని పోరాడిన కాళోజీ ప్రజాకవి అయ్యారని అన్నారు. కార్యక్రమంలో బట్టు కిరీటం, నర్సింగు కోటయ్య, ఎం.వెంకటరెడ్డి, కంబాలపల్లి శివరాణి, బొజ్జ అనిల్‌కుమార్, మల్లేశం, ఎం.సావిత్రి, గోవర్ధనగిరి, ప్రభాకర్, లింగస్వామి, భూపాల్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

యూరియా కష్టాలను తీర్చండి

మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే బీఎల్ఆర్ వినతి

మిర్యాలగూడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ రైతుల యూరియా కష్టాలను తొలగించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన కలిసి ఈ మేరకు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో రైతులకు కావల్సిన యూరియా అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. మంత్రి స్పందిస్తూ గురువారం వరకు రైతులకు కావల్సినంత యూరియా సమకూర్చుతామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుడుం అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన ఏఐసీటీయూ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం రైతులను ఇబ్బందులకు గురిచేసేలా లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.30వేలు చెల్లించాలని, ఈపీఎఫ్, పెన్షన్ రూ.15వేలు అమలు చేయాలని, మునిసిపాలిటీ, గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికుల కుటుంబానికి రూ.30లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 10 నుంచి 17 వరకు జరిగే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐసీటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్ర దానయ్య, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య, జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, పోతుగంటి కాశీ, మంద అనూక్, మోహన్‌నాయక్, జ్యోతి, శివ, ఆశీర్వాదం, వీరయ్య, కమలమ్మ, ఆదిలక్ష్మి, అనసూయ, సైదులు, నాగయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

జిల్లా మత్స్యశాఖ ఇన్‌చార్జిగా రాజారాం

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్యశాఖ అధికారిగా యాదాద్రి జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం.రాజారానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు మత్స్యశాఖ అధికారిగా పనిచేసిన ఎం.చరిత అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. కాగా, ఇన్‌చార్జిగా నూతనంగా నియమితులైన రాజారాం బుధవారం బాధ్యతలు తీసుకోనున్నారు.




సైబర్ క్రైం

వలలో చిక్కి విలవిల

● ఉమ్మడి జిల్లాలో 6వేలకు పైగా కేసులు నమోదు
● రూ.53 కోట్లు రికవరీ!

6

చచ్చి ఏం సాధిస్తాం



- ఆత్మహత్య వద్దు, ఆత్మస్థైర్యమే ముద్దు!
- అనాలోచిత క్షణికావేశం, మానసిక వ్యథతో బలవన్మరణాలు
- ఒక్క క్షణం గడిస్తే నిలుస్తుంది ప్రాణం
- తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్న యువత



జీవితంలో ఆటుపోట్లు సముద్ర కెరటాల్లాంటివి. వచ్చిపోతుంటాయి. ప్రయత్నంతో వాటిని దాటేస్తుండాలి తప్ప వాటికి తలవంచవద్దు. ఇటీవల కాలంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. చిన్న సమస్యలకే ప్రాణాలను బలితీసుకుంటున్నారు. బలవన్మరణాలతో బాధిత కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఇంటి పెద్దపోతే కుటుంబ సభ్యులు, పెంచిన కుమారుడు పోతే తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. సమస్యలను ఎదుర్కొనే జీవించాలే తప్ప జీవితాన్ని ఫణంగా పెట్టవద్దని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. చావు ఆలోచనను ఒక్కక్షణం పక్కన పెట్టి ఆలోచిస్తే జీవితం మరోలా ఉంటుందంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట క్రైం / నార్కట్‌పల్లి)

ఆత్మహత్యలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఇంటి యజమాని ఆత్మహత్య చేసుకుంటే ఆ లోటు ఆ కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఇల్లాలిపై బాధ్యతల భారం పడుతోంది. అదేవిధంగా వారి పిల్లల పెంపకంతో పాటు భవిష్యత్తు అంధకారమవుతోంది. క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడిన యువతతో వారి తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుతోంది. వృద్ధాప్యంతో కుమారుడి నీడలో హాయిగా గడుపుదామనుకునే వారి ఆశలు అడియాశలవుతున్నాయి. కుమారులు, కుమార్తె ప్రయోజకులుగా మారి గర్వంగా ఉండాలన్న తల్లిదండ్రులకు తీవ్ర శోకం మిగులుతోంది. ఇలాంటి సంఘటనలు ఇటీవల చోటుచేసుకుంటున్నాయి.

ఆ క్షణం గడిస్తే నిలుస్తుంది ప్రాణం

ఆత్మహత్య ఆలోచనను దాటేందుకు శ్రమించాల్సి ఉంటుందని, ఆ క్షణం గడిస్తే ప్రాణం నిలుస్తుందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. తమ సమస్యలను సన్నిహితులతో పంచుకుంటే కొంతమేర ఉపశమనం లభిస్తుంది. ఒక్కోసారి సమస్యకు పరిష్కారం కూడా దొరుకుతుంది. ఆత్మహత్య చేసుకునే ఆలోచనను విరమించుకుంటారు. దీంతో వారి ప్రాణాలు నిలుస్తాయని, సమస్యలతో బాధపడే వారు చెప్పే వారి మాటలను సన్నిహితులు కాస్త ఓపిగ్గా వినాలని సూచిస్తున్నారు. వారికి సలహాలు ఇవ్వడంతో పాటు భవిష్యత్‌పై ఆశలు పెంచేలే ప్రయత్నంచేయాలి. సమస్యను ఎలా ఎదుర్కోవాలో ధైర్యం చెబితే ఆత్మహత్యలకు పాల్పడకుండా ఉండే అవకాశం లేకపోలేదు.

మానసిక బలహీనతలతోనే....

మారిన పరిస్థితుల్లో మానసిక బలహీనతల వల్ల బలవన్మరణాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే ఇవి రెండు రకాలు కాగా అందులో ప్రణాళిక మేర స్థిర నిర్ణయాలతో చేసుకునేవి. తాత్కాలిక ఆవేశంతో చేసుకునే ఆత్మహత్యలు ఉంటున్నాయి. దీర్ఘకాల నిస్పృహ, ఒంటరితనం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడే వారు మొదటి కోవలోకి వస్తుండగా, క్షణికావేశంతో చేసుకునే వారి దారి వేరు. అప్పటికప్పుడు తీసుకునే నిర్ణయం, అహం దెబ్బతిన్నా, పరువు నష్టం కలిగినా, తప్పు చేసినప్పుడు, ఆత్మాభిమానం దెబ్బతిన్నప్పుడు జరుగుతుంటాయి.

చట్టం ఏం చెబుతోంది

గతంలో ఆత్మహత్య చేసుకోవడాన్ని నేరంగా పరిగణించేది. ఉరివేసుకున్నా, క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినా గతంలో ఐపీసీ సెక్షన్ 309 కింద పోలీసులు కేసు నమోదు చేసేవారు. కానీ ఆత్మహత్యకు పాల్పడటాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం నేరంగా పరిగణించకూడదని సూచించింది. ఒక మనిషి తన బలహీనతల కారణంగానే బలవన్మరణానికి పాల్పడుతున్నారని వారిపట్ల సానుభూతి చూపించాలని చెప్పింది. దీంతో ఆత్మహత్య ఘటనలపై పోలీసులు కేవలం మరణానికి కారణాలు మాత్రమే పేర్కొంటూ బీఎన్ఎస్ సెక్షన్ 194 కింద మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారు.

ఆత్మహత్యకు కారణాలు

- తీవ్రమైన నిరాశ, నిస్పృహ
- అవగాహన లేని ప్రేమలు
- ఆత్మీయులు దూరమవడం
- ఆర్థిక ఇబ్బందులు తలెత్తడం
- భవిష్యత్‌పై భయం
- వేధింపులకు గురవడం
- ఒంటరితనం
- పని, ఇతర ఒత్తిడులు

పరిష్కార మార్గాలు

- అందరికీ కష్టాలు, ఇబ్బందులు ఉంటాయని గ్రహించాలి
- డబ్బులతో ప్రతీ సమస్య పరిష్కారం కాదు.
- సమస్యలకు ఆందోళన చెందవద్దు
- అవరోధాలను అవకాశాలుగా మలుచుకోవాలి.
- నేటి పెద్ద సమస్య రేపటికి చిన్నసమస్యగా మారొచ్చు.
- ప్రేమ జీవితానికి అవసరమే, కానీ జీవితాశయం కాకూడదు.
- తమ చర్యలనంతర కుటుంబ ఇబ్బందులను గుర్తించాలి
- జీవితం కష్టసుఖాల సంగమం.
- సానుకూల దృక్పథాన్ని పెంచుకోవాలి
- కొత్త మార్గంలో ప్రయత్నించాలి వైఫల్యానికి మనస్థాపం చెందవద్దు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి.

డయల్-100కు ఫోన్ కాల్ కాపాడింది



కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురైన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం అడివెంల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొన్నినెలల కిందట డయల్-100కు ఫోన్ చేశాడు. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలిపాడు. అనంతరం ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. వెంటనే స్పందించిన అర్వపల్లి పోలీసులు సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా అతడు ఉన్న ప్రాంతాన్ని గుర్తించి వేగంగా వెళ్లి అతడిని ప్రాణాలతో రక్షించారు. అనంతరం కౌన్సెలింగ్ చేసి అతడిని ఇంటికి పంపించారు.



గొంగిలి పురుగుగా పరిణామక్రమాన్ని దాటినప్పుడే అందరికీ ఇష్టమైన సీతాకోకచిలుకగా మారుతాం. అదేవిధంగా ఆకాశాన్ని అందుకోవాలనే ఆరాటంలో శక్తికి మించి ప్రయత్నించే ఫినిక్స్ పక్షిని స్ఫూర్తిగా తీసుకోవాలి. ఆ పక్షిలా ఏరోజూ ఆకాశం తాకలేమన్న ఆలోచనను మన ఆలోచనల్లోకి రానివ్వకపోవడమే మొదటివిజయమంటే. ఏదైనా సాధించాలన్న తపనను పెంచుకోవాలి తప్ప ప్రాణాలను ఫణంగా పెట్టవద్దని మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

పరివర్తన కోసం సదస్సులు



ఆర్థికపరమైన సమస్యలతో ఇంటిపెద్ద, యువకులైతే బెట్టింగ్ యాప్‌ల ప్రభావం, ప్రేమ వైఫల్యం, జాబ్ రాలేదన్న నైరాశ్యంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మస్థైర్యంతో నిలిచి గెలవాలే తప్ప ఆత్మహత్యలకు పాల్పడవద్దు. నార్కట్‌పల్లి పరిధిలో ఈ ఏడాది ఏడుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కొందరిని డయల్-100 కాల్‌తో కాపాడాం. ఇలాంటి వారిలో పరివర్తన కోసం ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆధ్వర్యంలో జిల్లాలో పలు అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి.

దగ్గుల క్రాంతికుమార్, ఎస్ఐ నార్కట్‌పల్లి

హిప్నోసిస్‌తో అరికట్టవచ్చు



జీవితం భరించలేనిదిగా అనిపించనపుడు మనసు ప్రమాదకరమైన అబద్ధాలను చెబుతుంది. దారి లేదు, ఎప్పటికీ ఈ బాధ తీరదు, అనే ఆలోచనలు మనిషిని ఆత్మహత్యవైపునకు నెడతాయి. కానీ హిప్నోసిస్ ద్వారా ఆత్మహత్యల నుంచి అరికట్టవచ్చు. మనసును రీప్రోగ్రామింగ్ చేసే క్లినికల్ ప్రక్రియే హిప్నోసిస్. మనిషిని ప్రతికూల ఆలోచనల నుంచి బయటపడేస్తుంది. కొత్త శక్తివంతమైన విశ్వాసాలను, ఆత్మవిశ్వాసాన్ని భావోద్వేగ ప్రశాంతతను కాపాడుతుంది.

చెరుకు శశికిరణ్, హిప్నోసిస్ కోచ్

108 అంబులెన్స్‌లో ప్రసవం, తల్లీ బిడ్డా క్షేమం



మగబిడ్డను ప్రసవించిన అంజలి, శిశువుతో టెక్నీషియన్ వెంకటేశం

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణికి 108 అంబులెన్స్ సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో కాన్పు చేశారు. పండంటి మగబిడ్డకు జన్మనివ్వగా తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు. వారిని నల్లగొండ జిల్లా కేంద్రంలోని మాతాశిశు కేంద్రానికి తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని ఎరసానిగూడెం గ్రామానికి చెందిన ఉట్కూరు అంజలి గర్భవతి. సోమవారం అర్ధరాత్రి నుంచి ఆమెకు పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో ప్రసవం కోసం అంజలిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నంలో భాగంగా ఆమె కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు మంగళవారం ఉదయం 6.40 గంటలకు ఫోన్ చేయగా వెంటనే అక్కడికి వెళ్లారు. అంజలిని జాగ్రత్తగా అంబులెన్స్‌లో నల్లగొండలోని ఎంసీహెచ్‌కు తరలిస్తున్నారు. మార్గమధ్యలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 కాల్‌సెంటర్‌లో ఉండే వైద్యుల సూచన మేరకు బేబీ కేర్ తీసుకుంటూ టెక్నీషియన్ కూరాకుల వెంకటేశం చికిత్స అందించారు. అనంతరం నల్లగొండలోని ఎంసీహెచ్‌లో చేర్చారు. క్షేమంగా తల్లీబిడ్డను ఆసుపత్రికి చేర్చిన అంబులెన్స్ సిబ్బంది టెక్నీషియన్ కూరాకుల వెంకటేశం, పైలట్ బీ.రవిలకు అంజలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఓ బ్యాంకు ట్రైనింగ్ సెంటర్‌లో లైంగిక వేధింపులు?

నల్లగొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ప్రధాన బ్యాంకుకు అనుబంధంగా కొనసాగుతున్న ట్రైనింగ్ సెంటర్‌లో మహిళలను లైంగికంగా వేధిస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఆ ట్రైనింగ్ సెంటర్‌లో పనిచేసే మహిళా ఉద్యోగితో పాటు ట్రైనింగ్ కోసం వివిధ గ్రామాల నుంచే మహిళలను కూడా వేధిస్తున్నట్లు తెలిసింది. తిరిగి ఎవరైనా మహిళలు నిలదీస్తే వారిని లక్ష్యంగా చేసి పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసులు పెడుతున్నట్లు సమాచారం. గతంలో పనిచేసిన పలువురు డైరెక్టర్లు కూడా శిక్షణకు వస్తున్న మహిళలకు ఇవే వేధింపులకు పాల్పడిన సందర్భాలూ ఉన్నాయి. మహిళలతో అసభ్యంగా మాట్లాడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయంపై ఇబ్బందులు ఎదుర్కొన్న మహిళ తన సమీప బంధువుకు తెలియజేయడంతో రెండు రోజుల క్రితం ట్రైనింగ్ సెంటర్‌కు వచ్చి అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని చితకబాదినట్లు తెలిసింది.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాల పట్టివేత



మట్టిని తరలిస్తున్న టిప్పర్

రాజాపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బొందుగుల రెవెన్యూ పరిధి నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొందుగుల శివారు నుంచి ఐదు రోజులుగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. టిప్పర్లతో మట్టిని ఆలేరు మండలం రాజానగర్‌లోని ఓ వెంచర్‌కు తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారన్న సమాచారం మంగళవారం పోలీసులకు అందడంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. రెండు ఎక్స్‌కవేటర్, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. మట్టి తరలింపుపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు

సూర్యాపేటలో సత్యనారాయణ క్లినిక్ బెడ్స్ సీజ్

భానుపురి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నల్లాలబావి రోడ్డులోని సత్యనారాయణ క్లినిక్‌ను మంగళవారం సూర్యాపేట డీఎంహెచ్‌వో పీ.చంద్రశేఖర్, డిప్యూటీలు డీఎంహెచ్‌వోలు జీ చంద్రశేఖర్, జయమనోహరి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీశైలం తనిఖీచేశారు. క్లినిక్‌కు మాత్రమే అనుమతులు ఉన్నాయని బెడ్స్ వేసే అనుమతులు లేవని నోటీసులు జారీ చేసి బెడ్స్ వేసిన గదిని సీజ్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. అనుమతులు లేని క్లినిక్‌లను మూసి వేస్తామన్నారు. జిల్లాలో నిరంతరం తనిఖీలు ఉంటాయని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. అనుమతులు లేకుండా ఆసుపత్రులను నిర్వహించవద్దని హెచ్చరించారు. అనర్హులు ఎవరైనా ఆసుపత్రులు అందిస్తుంటే సమాచారం ఇవ్వాలన్నారు.

చిలుకూరులో కూలిన ఇల్లు



కూలిన రేకుల ఇంటిని పరిశీలిస్తున్న ఆర్ఐ శ్వేత

చిలుకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చిలుకూరులో ఇటీవల కురిసిన వర్షాలకు ఓ ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన ముదిగొండ సైదులు నివాసముంటున్న రేకుల ఇంటి గోడలు ఇటీవలి వర్షాలకు నానిపోయి మంగళవారం కూలిపోయాయి. గోడ కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. బాధితులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆర్ఐ శ్వేత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విచారణ చేసి పంచనామాను తహసీల్దార్‌కు అందజేయనున్నట్లు ఆర్ఐ తెలిపారు.

సైబర్ క్రైం వలలో చిక్కి విలవిల

- ఉమ్మడి జిల్లాలో 6వేలకు పైగా కేసులు
- రూ.53 కోట్లు రికవరీ



ఉమ్మడి జిల్లాలో 6,848 కేసులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 6,848 కేసులు నమోదు కాగా సైబర్ నేరగాళ్ల ఖాతాలను స్తంభింపచడం ద్వారా సైబర్‌క్రైమ్ పోలీసులు ఇప్పటివరకు రూ.53 కోట్ల మేర రికవరీ చేసినట్లు తెలుస్తోంది. ఒక్క మిర్యాలగూడ డివిజన్‌లోనే ఈ ఏడాదిలో సుమారు 60 కేసుల వరకు నమోదు కాగా, రూ.10 కోట్ల వరకు సైబర్ కేటుగాళ్లు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఫిర్యాదు వరకు రాని ఉదంతాలు చాలానే ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

స్మార్ట్‌ఫోన్‌లు వచ్చాక సైబర్ క్రైం పెరిగిపోతున్నాయి. అమాయకుల భయాన్ని ఆసరా చేసుకుని దోచుకుంటున్నారు. వారం రోజుల కిందట నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగికి వాట్సాప్‌కాల్ వచ్చింది. ముంబైలో మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్ వద్ద మీ ఆధార్‌కార్డు దొరికింది. మీపై సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. బెయిల్ రావాలంటే రూ.30,70,719లు చెల్లించాలి అంటూ హెచ్చరించారు. ఎవరికి చెప్పినా పోలీసులు మిమ్మల్ని అరెస్ట్ చేసే అవకాశం ఉందని బెదిరించారు. మీరు హౌస్ అరెస్ట్‌లో ఉన్నారు ఇల్లు వదిలి వెళ్లొద్దని హెచ్చరించారు. రెండు గంటలకు ఒకసారి అయామ్ సేఫ్ అని మెసేజ్ పంపాలని ఆదేశించారు. అంత డబ్బు ఇచ్చుకోలేమని ప్రాధేయపడటంతో రూ.20 లక్షలైనా డబ్బులు పంపితే బెయిల్ ఇప్పించి విడిపిస్తామని నమ్మబలికారు.సమయానికి మెసేజ్ పెట్టకుంటే మిమ్మల్ని అరెస్ట్ చేశారా అంటూ వేధించేవారు. దీంతో రిటైర్డ్ ఉద్యోగి దంపతులు ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నించి విరమించుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే ఫోన్ చేయడంతో

బెయిల్ కోసం బంధుమిత్రుల వద్ద రూ.15 లక్షలు వృద్ధదంపతులు పోగు చేశారు. మరో రూ.5 లక్షల కోసం మాజీ ఎమ్మెల్యేకు చెప్పి బోరుమన్నారు. ఆయన జిల్లా ఎస్పీ వద్దకు తీసుకవెళ్లి జరిగినందంతా చెప్పడంతో సైబర్ క్రైం కేటుగాళ్ల పనిగా తేల్చడంతో చచ్చి బతికినంత పనైందని రిటైర్ ఉద్యోగి వాపోయారు. గండం గడిచిందని ఊపిరిపీల్చుకున్నారు.

- గత నెల 21న వాడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి తన ఫోన్‌కు వచ్చిన లింక్ ఓపెన్ చేయడంతో సైబర్ నేరస్థుడు ఎనిమిది రోజుల్లో అతడి ఖాతానుంచి రూ.2.20 లక్షలను కాజేశాడు. లాటరీ తగిలిందని మెయిల్ పంపడం, ఉద్యోగాల పేరుతో ఫోన్‌కు వచ్చిన లింక్‌లు ఓపెన్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్లు డాటాను చోరి చేసి ఖాతాలను డబ్బులు కొట్టేస్తున్నారు.

అనవసర ఫోన్‌కాల్స్‌కు, లింక్‌లను దూరంగా ఉండాలి



సైబర్ క్రైమ్‌లలో నేరస్థులను పట్టుకోవడం కష్టం. ప్రజలు సైబర్‌నేరాలపై అవగాహన పెంచుకోవాలి. అనవసర లింక్‌లు ఓపెన్ చేయకపోవడం మంచిది. ఉచితంగా డబ్బులు వస్తాయని ఆశకు పోవద్దు. సైబర్ దాడులకు గురైనవారు 1930 నెంబరుకు ఫిర్యాదుచేయాలి. బాధితుల పేరు మెయిలింగ్ అడ్రస్ వివరాలను తెలియజేయాలి. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలి.

పీఎన్‌డీ ప్రసాద్, రూరల్ సీఐ

అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆత్మహత్యాయత్నం



పెట్రోల్ డబ్బాతో ఆందోళన చేస్తున్న చక్రమ్మ కుటుంబ సభ్యులు

ఆలేరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తమ అక్రమంగా పౌతి చేశారని ఆరోపిస్తూ స్వాతంత్ర్య సమరయోధుడి కుటుంబసభ్యులు ఆత్మహత్యాయత్నం చేశారు. పెట్రోల్ డబ్బాతో యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సమరయోధుడు కూరెళ్ల వీరయ్య కోడలు కూరెళ్ల చక్రమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శారాజీపేట గ్రామంలోని సర్వే నెంబరు 557ఈ 3లో ఎకరం ఎనిమిది గుంటల భూమిలో ఆరుగురికి ఎనిమిది గుంటల చొప్పున భూమి ఉంది. కూరెళ్ల వీరయ్యతో పాటు కేమిడి లక్ష్మి, కంతి శాంతమ్మ, దూడల కౌసల్య, చెరుపల్లి పౌలు, పుట్టాల డానియేల్‌కు 8 గుంటల చొప్పున భూమి ఉంది. గ్రామానికి చెందిన సముద్రాల కుమార్ చక్రమ్మ వాటాకు వచ్చే ఎనిమిది గుంటల భూమిని కొనుగోలు చేస్తానని చెప్పి మూడు నెలల క్రితం రూ.10వేలు బయానా ఇచ్చారు. ఆ భూమి విలువైనది కావడంతో కుమార్‌తో ఆ గ్రామ తాజా మాజీ సర్పంచ్ బండ పర్వతాలు బీఆర్ఎస్ నాయకులు బండ మహేందర్, దూడల శ్రీధర్‌తో పాటు కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న నీరటి సాయికుమార్‌లు కలిసి రెవెన్యూ సిబ్బందితో కలసి లంచాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చక్రమ్మ ఆరోపించింది. తమకు పౌతి చేయాలని 8 నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి న్యాయం చేయలేదని చక్రమ్మ తెలిపింది. తమ పేరున పౌతి చేయడానికి ఆర్ఐ రూ.2 లక్షలు లంచంగా అడిగారని ఆరోపించారు. తనకు భర్త లేడని తన కుమారుడు పక్షవాతంతో బాధపడుతున్నాడని అంతా డబ్బు ఇవ్వలేనని వేడుకున్నా కనికరించలేదన్నారు. ఆగస్టు 18న వారికి పౌతి చేయించి 19న రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. గత 50 ఏళ్లుగా పైగా కబ్జాలో ఉన్న తమకు న్యాయం చేయకుండా ఇతరులకు చేయడం ఏంటని ప్రశ్నించారు. చట్టప్రకారం రావాల్సిన 8 గుంటల భూమిని పౌతి చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామని చక్రమ్మతో పాటు ఆమె కుమారుడు ఆంజనేయులు భార్య గాయత్రి, మరిది కుమారుడు అజయ్‌లు పెట్రోల్ బాటిల్‌తో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడికి కుటుంబానికి న్యాయం జరుగకపోతే ఎలా అని ప్రశ్నించారు. తహసీల్దార్ ఆంజనేయులు, స్థానిక పెద్దలు బాధితులతో మాట్లాడి అధికారులు న్యాయం చేస్తారని చెప్పడంతో ఆందోళన విరమించారు.

గుండెపోటుతో గుట్ట పీహెచ్‌సీలో వ్యక్తి మృతి

- సీపీఆర్ చేసినా దక్కని ప్రాణం
- ప్రాణాల మీదకు తెస్తున్న ఈసీజీ, ఆక్సిజన్ సౌకర్యాల కొరత



చంద్రశేఖర్(ఫైల్)

యాదగిరిగుట్టరూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గుండెపోటుతో వ్యక్తి మృతి చెందాడు. వైద్యులు సీపీఆర్ చేసినా ప్రాణం దక్కలేదు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సాదువెల్లి గ్రామానికి చెందిన మార్గం చంద్రశేఖర్(40) తనకు చెమటలు, ఆయాసంతో పాటు ఛాతిలో నొప్పి వస్తుందని ఉదయం 11 గంటలకు గుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. అక్కడే ఉన్న మెడికల్ ఆఫీసర్, యాదగిరిపల్లి వైద్యులు ఇద్దరు కలిసి బీపీ, మధుమేహ పరీక్షలు నిర్వహించి అన్ని నార్మల్‌గా ఉన్నాయని, తాత్కాలికంగా మందులు ఇచ్చి ఈసీజీ తీయించుకోవాలని సూచించారు. గుండెపోటు లక్షణాలు ఉన్నాయని గమనించలేదు. ఆసుపత్రి ఆవరణ నుంచి బయటకు వచ్చిన చంద్రశేఖర్ బయటఉన్న బెంచీమీద కుప్పకూలాడు. వెంటనే వైద్యులు వచ్చి సీఆర్‌పీ చేసినప్పటికీ ఫలితం కనిపించలేదు. అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా ఆలేరు నుంచి ఆలస్యంగా వచ్చింది. చంద్రశేఖర్ మృతి చెందినప్పటికీ నిర్ధారణ కోసం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్‌కు స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా మెకానికల్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమార్తె కీర్తన, భార్య ఉన్నారు.

ఈసీజీ తీసుకురావాలని సూచించాం

మృతుడు ఛాతిలో నొప్పి అని రావడంతో వెంటనే బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించగా అన్ని మామూలుగానే ఉన్నాయి. మందులు ఇచ్చి, ఈసీజీ తీసుకుని రావాలని సూచించాం. ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లి బెంచీపై కూర్చొని అక్కడే పడిపోయాడు. సమాచారం రాగానే సకాలంలోనే స్పందించాం. అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి సీఆర్‌పీ చేసినా ఫలితం లేదు. మృతి నిర్ధారణకు భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించాం.

పావని, మెడికల్ ఆఫీసర్, గుట్ట పీహెచ్‌సీ

అందుబాటులో లేని ఈసీజీ, ఆక్సిజన్

గుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గుండె సంబంధిత ఇబ్బందులు గుర్తించే ఈసీజీ, ఆక్సిజన్ లేవు. అదేవిధంగా ప్రమాదాన్ని తాత్కాలికంగా నిరోధించే ఔషధాలు కూడా లేనట్లు సమాచారం. దీంతో గుండె సంబంధిత ప్రమాదాలను అరికట్టలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా యాదగిరిగుట్ట క్షేత్రానికి పెద్దసంఖ్యలో వచ్చే భక్తులు, స్థానిక ప్రజలకు అత్యవసర సేవలు అందకుండాపోతున్నాయి. అత్యవసర ఔషధాలు సైతం అందుబాటులో లేనట్లు సమాచారం.

ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి వెంటనే గుండెపోటును నిర్ధారించే ఈసీజీ, తక్షణ ఉపశమనం కలిగించే ఆక్సిజన్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎర్రకుంటతండాలో విషాదఛాయలు

చింతలపాలెం / గరిడేపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరి తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చింతలపాలెం మండలం ఎర్రకుంట తండా గ్రామానికి చెందిన తండ్రి, కుమారుడు భూక్య భాగ్య, భూక్య కృష్ణ, వరుసకు కుమార్తె ధీరావత్ కమిలి మంగళవారం ద్విచక్రవాహనంపై ఎర్రకుంటతండా నుంచి అవంతీపురం సంతకు మేకలను కొనేందుకు వెళ్తున్నారు. గరిడేపల్లి మండలం రాయినిగూడెం సమీపంలో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో భూక్య భాగ్య(70) అక్కడికక్కడే మృతి చెందగా, కృష్ణ, కమిలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం మిర్యాలగూడలోని ఆసుపత్రికి తరలించారు.

డీజిల్ దొంగతనం

చిలుకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చిలుకూరులో ఆగివున్న లారీలలో డీజిల్ చోరీ జరిగింది. ఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చిలుకూరులోని ఇండియన్ బంక్‌లో నిలిపిన సీతారాంపురం గ్రామానికి చెందిన గన్నా ప్రసాద్ లారీ నుంచి 200 లీటర్ల డీజిల్, సీతారాంపురం స్టేజీ వద్ద నిలిపిన ఇదే గ్రామానికి చెందిన గన్నా ప్రవీణ్ లారీలో 400 లీటర్ల డీజిల్ చోరీ జరిగింది. ట్యాంక్ మూతలను తొలగించి చోరీ చేసినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుడిబండలో అర్ధరాత్రి ఘర్షణ

కోదాడ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని గుడిబండ గ్రామంలో మద్యం తాగి సోమవారం రాత్రి ఘర్షణ పడిన ఏడుగురిపై కేసు నమోదైంది. ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గుడిబండ గ్రామానికి చెందిన ముగ్గురు తొగ్గరాయి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు మద్యం తాగి ఒకరినొకరు ఘర్షణ పడ్డారు. విచక్షణ రహితంగా దాడి చేసుకున్నారు. దీంతో గ్రామస్థులు భయభ్రాంతులకు లోనై సమాచారం ఇవ్వడంతో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మాతాశిశు సంరక్షణ చర్యలు భేష్

● దేవలమ్మ నాగారం గ్రామాన్ని సందర్శించిన ఉత్తర్‌ప్రదేశ్ సర్పంచులు



గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉత్తర్‌ప్రదేశ్ సర్పంచులు, కార్యదర్శులు

చౌటుప్పల్‌రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు భేష్ అని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం గ్రామాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల బృందం మంగళవారం సందర్శించింది. గ్రామ పంచాయతీ ఆవరణలో మాతాశిశు సంరక్షణపై సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల అధికారులు తీసుకుంటున్న చర్యల గురించి సర్పంచులకు వివరించారు. గర్భిణులకు పోషకాహారం, సాధారణ ప్రసవాలు, శిశువుల్లో పెరుగుదల, శిశుమరణాలు తగ్గింపు తదితర ఆరోగ్య సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో ప్రతాప్‌నాయక్, ఏపీడీ సురేష్, ఎంపీడీవో సందీప్‌కుమార్, ఎంపీవో అంజిరెడ్డి, డాక్టర్ రాము, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మట్టపల్లి ఆదాయం రూ.21.40లక్షలు

మఠంపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో మంగళవారం హుండీ లెక్కించారు.116రోజులకు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్, భక్తుల కానుకల ద్వారా రూ. 20,86,660, నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.53,380 మొత్తం రూ. 21,40,040 ఆదాయం వచ్చినట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, కార్యనిర్వహణాధికారి సిరికొండ నవీన్ తెలిపారు.

తొందరపాటు వద్దు

● నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం

సమస్యలకు ఆత్మహత్యే పరిష్కారం అనుకోవడం సరికాదు. జీవితంలో సమస్యలు ఉన్నాయని వాటిని తాము ఎదుర్కోలేమని మనసైర్యం కోల్పోయి చావును కోరుకుంటే తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చినవారవుతారు. నూరేళ్ల జీవితాన్ని క్షణికావేశంలో కోల్పోతున్నారు. చావే సమస్యలకు పరిష్కారం చూపుతుందని భావిస్తే ఏ సమస్యకైనా పరిష్కారం లభించదు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి.

● ఆంధ్రజ్యోతి, సూర్యాపేటక్రైం, నార్కట్‌పల్లి

యువత సంయమనం పాటించాలి



ఏదైనా సంఘటన చోటు చేసుకున్నప్పుడు యువత సంయమనం పాటించాలి. ప్రతి ఒక్కరికీ కష్టాలు వస్తుంటాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే విజేతలుగా నిలుస్తారు. ఆత్మహత్యలకు పాల్పడితే సమస్యలు పరిష్కారం కావు. జీవితంలో మనిషి ఎదిగే కొద్దీ అందరి జీవితాల్లో కష్టాలు ఉంటాయి. ప్రతి ఒక్కరూ వారు ఎదుర్కొనే సమస్యలను ఇతరులతో పంచుకుంటే ఉపశమనం కలుగుతుంది.

● షేక్ అలీమోద్దీన్ ఆల్‌ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సూర్యాపేట

ఒత్తిడిని జయించాలి



యువత, విద్యార్థులు ఒత్తిడిని జయించాలి. అప్పుడే భవిష్యత్ లక్ష్యాలను సాధించగలుగుతారు. తల్లిదండ్రులు వారి పిల్లలపై ఒత్తిడి తేకూడదు. అంతేకాకుండా వారి ప్రవర్తన వైపు దృష్టి సారించాలి. పిల్లల మానసిక స్థితి బలంగా ఉండేటట్లు ప్రోత్సహించాలి. ఒంటరితనం ఆత్మహత్యకు ప్రేరేపించే విషయాల పట్ల జాగ్రత్త వహించాలి. విద్యార్థుల్లోని నిరాశను గుర్తించి అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉంటుంది.

● జడల నాగరాజు, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్, సూర్యాపేట

ఆందోళనకు చికిత్స చేయించుకోవాలి



ఆత్మహత్యకు ప్రధానంగా మూడు కారణాలు ఉంటాయి. ఆత్మహత్యకు పాల్పడే వారిని గమనిస్తే జన్యుపరంగా వచ్చే ప్రభావం, నిరాధరణ, ఒత్తిడి, అవమానకరంగా భావించడం, తనకు తాను వ్యతిరేకతతో ఆలోచించుకొని పనికిరాని వారమని నిరాశ నిస్పృహాలకు గురికావడం లాంటివి జరుగుతుంటాయి. అలాంటి వారు మానసిక వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. జీవితంలో ఎన్నో అవకాశాలు వస్తాయి. వాటిని గుర్తించలేక వాటిని ఉపయోగించుకోకపోవడం దురదృష్టకరం.

● దాండ్గే శిరీష, మానసిక వైద్య నిపుణురాలు

కౌన్సెలింగ్‌తో మార్పు తీసుకురావొచ్చు



ఆత్మహత్యకు పాల్పడేవారు తీవ్ర డిప్రెషన్‌లో ఉంటారు. వాస్తవానికి ఆత్మహత్యకు పాల్పడాలనే ఆలోచన చావాలనే కోరిక కాదు భరించలేని బాధను ముగించాలనే కోరిక. అలాంటి వారిని గుర్తించి సమయానికి కౌన్సెలింగ్ ఇప్పిస్తే బలవంతంగా ప్రాణాలను తీసుకోవాలనే క్షణికావేశాల నిర్ణయాల నుంచి తప్పించవచ్చు. ఈ సమస్యకు పరిష్కారం కేవలం థెరపీ గదుల్లో ఇచ్చే కౌన్సెలింగ్‌తోనే కాకుండా కుటుంబాల్లో, పాఠశాలల్లో, కార్యాలయాల్లో, సమాజం ద్వారానూ చేయవచ్చు. మానసిక బాధను శారీరక అనారోగ్యం లాగానే అత్యవసరంగా చూడాలి.

● చెరుకు దేవాన్ని, సైకాలజిస్టు.

ప్రాణం విలువైనది.. కాపాడుకుందాం



ప్రాణం చాలా విలువైనది. క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలతో ఆత్మహత్యలకు పాల్పడి మీపై ఆధారపడిన కుటుంబాలను ఆగం చేయవద్దు. సమస్యలను అధిగమించాలే తప్ప ఆత్మహత్యలే శరణ్యం కాకూడదు. ఆత్మహత్యతో సాధించేది కూడా శూన్యమే. కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు పెద్దలు. జీవితంలో ఓటమి రేపటి గెలుపునకు సోపానమవుతుంది. తగిలే రాళ్లను పునాది చేసి ఎదగాలని తరిమే వాళ్లను హితులుగా మార్చి ముందుకెళ్లాలని ఓ సినిమాలో రచయిత చెప్పినట్లుగా కష్టాలను గట్టెక్కే ఆలోచన చేయాలే తప్ప ఆత్మహత్య చేసుకోవడం సరైంది కాదు. చనిపోయి ఏం చేస్తాం.. బతికి ఉండే సాధిద్దాం.

● చొక్కళ్ల పుష్పగిరి, విశ్రాంత ఉపాధ్యాయుడు

స్నాతకోత్సవానికి సన్నాహాలు

- ఏ - ప్లస్ గ్రేడ్ వైపు ఎంజీయూ అడుగులు
- 2028 న్యాక్ అక్రిడిటేషన్ గుర్తింపే లక్ష్యంగా ప్రణాళికలు
- ఇప్పటికే 22 కోర్సులు
- కొత్తగా మరో 5 కోర్సులకు ప్రతిపాదనలు
- రూ.60 కోట్లతో అకడమిక్ భవనాల నిర్మాణానికి ఏర్పాట్లు
- ఈ నెల 15న 4వ స్నాతకోత్సవానికి సన్నాహాలు




నల్లగొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సన్నద్ధమవుతోంది. 2007 సంవత్సరంలో ప్రారంభమైన యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవం ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పాటు హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. యూనివర్సిటీ ప్రస్తుతం బీ - ప్లస్ గ్రేడ్‌లో ఉండగా 2028 న్యాక్ అక్రిడేషన్ గుర్తింపే లక్ష్యంగా యూనివర్సిటీ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏ - ప్లస్ గ్రేడ్ వైపు అడుగులు వేస్తున్నారు. ఏ - ప్లస్ గ్రేడ్ వస్తే సెంట్రల్ ఫండ్ అధికంగా రావడంతో పాటు జాతీయస్థాయిలోనే యూనివర్సిటీ గుర్తింపు లభిస్తుంది. 2008లో తొలిసారిగా అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. అంతకు ముందు జిల్లా కేంద్రం సమీపంలో అడ్మిస్ట్రేషన్ భవనంలో యూనివర్సిటీ నిర్వహించగా 2012 సంవత్సరంలో అన్నెపర్తిలోని క్యాంపస్‌కు చేరింది. విద్యార్థులకు తొలుత యూనివర్సిటీ నుంచి ప్రొవిజన్ సర్టిఫికెట్లను మాత్రమే ఇవ్వగా, 2019లో డిగ్రీ సర్టిఫికెట్‌ను యూనివర్సిటీ అధికారులు డిజైన్ చేశారు. 2017 సంవత్సరంలో తొలిసారిగా స్నాతకోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత 2018-19 సంవత్సరాల్లో ప్రస్తుతం నాలుగోసారి ఈ నెల 15వ తేదీన స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 22 మందికి పీహెచ్‌డీల ప్రదానంతో పాటు 57 మందికి గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేయనున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన విద్య -1 పోర్టల్ ద్వారా యూనివర్సిటీ కార్యకలాపాలను నిర్వహిస్తూ వస్తోంది. దాదాపు 240 ఎకరాల్లో ఈ యూనివర్సిటీని నిర్వహిస్తున్నారు.

కొత్తగా మరో 5 కోర్సుల నిర్వహణకు ఏర్పాట్లు

యూనివర్సిటీలో కొత్తగా మరో 5 కోర్సులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో ఫార్మసీ, ఎల్ఎల్‌బీ, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, గవర్నెర్స్(ఎంఏ) కోర్సులకు ప్రతిపాదనలు పంపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎల్ఎల్‌బీ, ఫార్మసీ కళాశాల ఏర్పాటుకు అనుమతి వచ్చింది. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఎంఈడీ, బీపీఈడీ, గవర్నెర్స్ వంటి కోర్సుల ఏర్పాటుకు యూనివర్సిటీ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ వసతిగృహాలు, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ నిర్మాణాలు జరుగుతున్నాయి. అకాడమిక్ సంస్కరణలో భాగంగా విద్యార్థుల 75 శాతం హాజరు విధిగా ఉండేలా అమలుచేయడంతో పాటు నైపుణ్యాల పెంపునకు అదనపు కోర్సులు ఏర్పాటు చేస్తున్నారు.

టాస్క్ ద్వారా అదనపు తరగతులతో పాటు వివిధ సంస్థల ద్వారా జరిగిన అవగాహన ఒప్పందంతో విద్యాబోధన జరుగుతుంది. అదేవిధంగా ఇంజనీరింగ్ విద్యార్థులు చేపట్టిన నూతన ప్రాజెక్టులు వారిలో ఉత్సాహాన్ని నింపే విధంగా కొత్త ఆవిష్కరణ వైపు అడుగులు వేస్తున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు తమ పరిశోధనలను నాణ్యమైన జర్నల్స్‌లో మాత్రమే ప్రచురణకు పరిగణించి నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి విద్యార్థి ప్రతీరోజు 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఖచ్చితంగా తరగతుల్లో ఉండేలా చైతన్యం తీసుకువచ్చారు. విద్యార్థులు ఎవరైనా చదువుల్లో వెనుకబడి ఉంటే వారికి సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించి విద్యలో రాణించేలా చర్యలు చేపట్టారు. విద్యా బోధన మెరుగుగా ఉండటం కోసం అత్యవసర ప్రాతిపదికన ఆరుగురు ప్రొఫెసర్లనును తీసుకున్నారు. ఈ నెల 15వ తేదీ తర్వాత వారు విధుల్లో చేరనున్నారు.

ఏ- ప్లస్ గ్రేడ్ సాధన కోసం కృషి



ప్రస్తుతం బీ-ప్లస్‌లో ఉన్న ఎంజీ యూనివర్సిటీని 2028లో న్యాక్ అక్రిడేషన్‌లో ఏ - ప్లస్ సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. ఈ నెల 15వ తేదీన జరిగే స్నాతకోత్సవంతో కొత్త ఉత్సాహంతో ముందడుగు వేస్తాం. విద్యా పండుగలాగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి యూనివర్సిటీ ప్రతిష్ఠను మరింత పెంపొందిస్తాం. 22 మంది పీహెచ్‌డీలు, 57 మందికి బంగారు పతకాలను అందిస్తాం. విద్యార్థులు, అధ్యాపకుల్లో నూతన ఉత్సాహం నింపేలా ఈ కార్యక్రమం కొనసాగనుంది. కొత్తగా యూనివర్సిటీకి ఎల్ఎల్‌బీ, ఫార్మసీ కళాశాలలు వచ్చాయి. రాబోయే రోజుల్లో మరిన్ని కొత్త కోర్సులను తీసుకువస్తాం.

- ఖాజా అల్తాఫ్‌హుస్సేన్, వీసీ, ఎంజీయూ

500 మంది విద్యార్థులతో ప్రారంభం

మహాత్మాగాంధీ యూనివర్సిటీ 500 మంది విద్యార్థులతో ప్రారంభమై ప్రస్తుతం 2500 మంది విద్యార్థులతో కొనసాగుతోంది. 2008లో 6 కోర్సులతో ప్రారంభమై 22 కోర్సులతో నిర్వహిస్తున్నారు. అదేవిధంగా 18 డిపార్ట్‌మెంట్లు ఉన్నాయి. కోర్సుల విషయానికి వస్తే 10 కోర్సులు ప్రభుత్వ బడ్జెట్‌తో నిర్వహిస్తుండగా 12 కోర్సులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులతో కొనసాగుతున్నాయి. 70 మంది టీచింగ్ స్టాఫ్‌కు గాను 35 మంది ఉన్నారు. వీరంతా రెగ్యులర్ ప్రొఫెసర్లు. 46 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకొని విద్యార్థులకు విద్యను అందించేలా ఏర్పాటు చేశారు. ఆయా విద్యా సంవత్సరాలలో విద్యనభ్యసించిన విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. స్నాతకోత్సవాన్ని పండుగగా నిర్వహిస్తున్నారు.

ఈ స్నాతకోత్సవంలో 2022, 2023, 2024 విద్యా సంవత్సరాల్లో డిగ్రీ చదివిన 16,210 మంది విద్యార్థులకు, పీజీ చదివిన 3200 మందికి, బీఈడీ పూర్తి చేసిన 7800 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందించనున్నారు. విద్యార్థులు, అధ్యాపకుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే విధంగా అకాడమిక్ చర్చలు, అతిథుల ప్రసంగాలతో స్నాతకోత్సవం రోజు కొత్త లక్ష్యాలను నిర్దేశించి వాటి సాధన దిశగా యూనివర్సిటీ అడుగులు వేయనుంది. ప్రత్యేకంగా బాలికల వసతి గృహం కోసం రూసా పథకం కింద నిర్మాణాలు జరుగుతున్నాయి.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



ఆలయంలో ఆంజనేయస్వామికి హారతి నివేదిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడి కి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేదమంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి నివేదించారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖ మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖమండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకు పూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.13,70,794 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, ఆలయ ఉత్తర తిరువీధుల్లోని జర్మన్ టెక్నాలజీ హ్యాంగర్ ఫ్యాబ్రిక్ షెడ్డు అందుబాటులో తెచ్చి భక్తులకు ఎండ, వానల నుంచి రక్షణ కల్పించారు.



లక్ష్మీపుష్కరిణి వద్ద మండపంలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహం

ఆంజనేయస్వామికి పూజలేవీ?

క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి కొండకింద లక్ష్మీపుష్కరిణీ చెంత మండపంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, గుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులే ఇక్కడి గుడిలో ఆంజనేయస్వామికి కొబ్బరికాయలు కొట్టి, కుంకుమ సమర్పించి అక్కడే బొట్టు పెట్టుకొని తమ భక్తిని చాటుకుంటున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామికి పూజలు చేసేందుకు పూజారులను నియమించలేదు. కొండపైన విష్ణుపుష్కరిణీ చెంత ఆంజనేయస్వామి గుడి ఉన్నప్పటికి భక్తులు అక్కడకు వెళ్లడం లేదు. లక్ష్మీపుష్కరిణీ చెంత మండపంలో పూజలు నిర్వహించేందుకు అర్చకులను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

పెద్దచెరువును శుభ్రం చేయరేమీ?

- వినాయక విగ్రహాలతో కలుషితమవుతున్న జలాలు
- మత్స్య సంపదకు పొంచి ఉన్న ప్రమాదం



బీబీనగర్ పెద్ద చెరువులో కుప్పలుతెప్పలుగా గణేష్ విగ్రహాలు

బీబీనగర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పెద్ద చెరువులోని గణేష్ నిమజ్జన ప్రదేశమంతా చెత్తాచెదారంతో నిండింది. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన గణపయ్య విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అధికారులు జాతీయ రహదారి ఆనుకుని ఉన్న స్థానిక పెద్దచెరువులో ఏర్పాట్లు చేశారు. విగ్రహాల నిమజ్జన ఉత్సవాలు ముగిశాయి. బీబీనగర్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి వందలాది గణేష్ విగ్రహాలను పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

నాలుగు రోజులు గడుస్తున్నా....

ఉత్సవాలు ముగిసి నాలుగు రోజులు గడుస్తున్నా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో నిమజ్జన ప్రదేశం మురికి కూపంగా తయారైంది. విగ్రహాలతో పాటు పూజా సామగ్రి, ఇతర వస్తువులను చెరువులోనే వదిలారు. వాటిని ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నా ఆ పని చేయలేదు. దీంతో గణేష్ విగ్రహాలతో పాటు చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు కావడంతో చెరువులో మంచినీరు కలుషితమవుతుంది. అంతేకాక మత్స్య సంపదకు ప్రమాదం పొంచి ఉందని మత్స్య కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిమజ్జనం చేసిన విగ్రహాల శిథిలాలు, వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

పార్కింగ్‌గా మారిన ప్రసాదాల టికెట్ల కౌంటర్



కౌంటర్‌లో క్యూలైన్లల్లో నిలిపిన ద్విచక్ర వాహనాలు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కొండపైన శివాలయానికి అభిముఖంగా ప్రసాదాల టికెట్ల కోసం అందుబాటులోకి తెచ్చిన కౌంటర్ల షెడ్డు నిరుపయోగంగా ఉంది. భక్తులకు వేర్వేరుగా టికెట్లు ఇచ్చేందుకు, ప్రసాదాలు అందించేందుకు 6కౌంటర్లను అందుబాటులోకి తెచ్చారు. 2024 ఏప్రిల్‌లో ప్రారంభించగా భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు 2025 జూలై 25 మరో ఆలయ ఈశాన్య దిక్కులో 5 కౌంటర్లతో కొత్త షెడ్డును ఏర్పాటు చేశారు. దీంతో శివాలయం ఎదురుగా ఉన్న కౌంటర్ల షెడ్డు నిరుపయోగంగా మారింది. క్యూలైన్‌లో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ స్థలంగా మారిపోయింది.

చేనేత కార్మికులు గ్రామీణ శాస్త్రవేత్తలు

● ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



ఆలేరు మాజీ సర్పంచ్ మురళికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అయిలయ్య

ఆలేరు రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు గ్రామీణ శాస్త్రవేత్తలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కొనియాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో మంగళవారం నిర్వహించిన నేతన్న పథకాల అమలు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. చేనేత కార్మికులు సమాజానికి నాగరికత నేర్పారని కొనియాడారు. రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత రెండో స్థానంలో చేనేతరంగం ఉందని అన్నారు. ఆలేరుకు చెందిన చేనేత కార్మికుల ఇబ్బందులు తొలగించేందుకు ఆసుయంత్రం తయారు చేసిన మల్లేశానికి పద్మశ్రీ రావడం గర్వకారణమన్నారు. చేనేత రంగానికి ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసి ఆదుకుందని అన్నారు. రూ.318 కోట్లు వెచ్చించి బతుకమ్మ చీరలు నేసేందుకు ఆరు వేల కుటుంబాలకు ఉపాధి కల్పించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలేరు మాజీ సర్పంచ్ చేనేత సంఘం నాయకులు చింతకింది మురళితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చింతకింది మురళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్యరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యాదగిరిగౌడ్, నాయకులు నీలం పద్మ, వెంకటేశ్వర్‌రాజు, ఏజా జ్, ఆర్.ప్రశాంత్, అనిత, ఎగ్గిడి యాదగిరి, భాస్కర్ పాల్గొన్నారు.

153 రోజుల్లో రూ.158 కోట్లు

(5వపేజీ తరువాయి)

నల్లగొండ, సూర్యాపేట, యాదగిరిగుట్ట, దేవరకొండ ప్రాంతాల్లో అత్యధికంగా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరిగింది. ఆ తరువాత స్థానాల్లో చౌటుప్పల్, భువనగిరి, బీబీనగర్, కోదాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు అంటే ఐదు నెలల్లో ఉమ్మడి జిల్లాలో 57,485 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ పూర్తికాగా, రూ.158.47కోట్ల ఆదాయం వచ్చింది.

2023-24, 2024-25లో డాక్యుమెంట్లు, ఆదాయం ఇలా...

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	2023-24లో డాక్యుమెంట్లు	ఆదాయం (రూ.కోట్లలో)	2024-25 డాక్యుమెంట్లు	ఆదాయం (రూ.కోట్లలో)	ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టువరకు డాక్యుమెంట్లు	(రూ.కోట్లలో)
నల్లగొండ	19,882	63,57,54,063	20,058	64,85,25,523	7970	25.22
చౌటుప్పల్	9,264	54,77,76,162	9,034	58,16,87,668	3565	17.96
యాదగిరిగుట్ట	21,939	46,86,76,323	16,909	45,52,99,354	8045	15.44
భువనగిరి	10,462	46,64,18,934	9,075	45,23,67,658	4071	14.74
సూర్యాపేట	17,464	44,01,20,454	18,707	41,20,98,250	6907	17.86
కోదాడ	10,078	33,26,01,454	9,176	38,02,99,097	3658	12.28
బీబీనగర్	9,804	31,84,90,916	9,181	29,73,11,343	3856	14.62
మిర్యాలగూడ	8,965	29,06,52,200	9,464	29,45,54,859	3798	13.72
దేవరకొండ	9,773	14,62,18,991	10,686	17,32,61,406	4640	6.73
హుజూర్‌నగర్	6,088	12,66,90,065	6,007	15,06,99,098	2252	5.42
నకిరేకల్	4,715	9,05,49,313	4,862	9,25,04,719	1960	3.70
నిడమనూర్	5,445	8,45,87,410	5,718	8,53,26,522	2392	3.77
మోత్కూర్	2,893	6,86,19,031	3,383	6,24,95,872	1471	2.21
రామన్నపేట	3,551	5,94,35,316	3,333	5,59,04,434	1347	2.08
చండూరు	3,097	4,70,67,949	3,128	5,25,33,195	1553	2.72
మొత్తం	1,43,420	412,36,58,581	1,38,721	419,48,68,998	57,485	158.47

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

కనగల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న కనగల్ హైస్కూల్‌కు చెందిన టీచర్ కందికట్ల కరుణాకర్‌ను మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు. విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సృజనకుమారి, ఉపాధ్యాయులు జానయ్య, కుంభం నర్సిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు కృష్ణ, సాగర్ పాల్గొన్నారు.

దాసరిగూడెంలో వలంటీర్ల అక్షరాస్యత సర్వే

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిగూడెం గ్రామంలో ఎంజీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్-2 యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం అక్షరాస్యత సర్వే చేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్-2 విద్యార్థులు దాసరిగూడెంను సందర్శించారు. 40మంది విద్యార్థులు గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి అక్షరాస్యత శాతాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త మద్దులేటి, ఆర్ట్స్ కాలేజీ డీన్ అంజిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అమృత్ ఆలస్యం



- మునిసిపాలిటీకి రూ.9.80 కోట్లు మంజూరు
- సాగని వాటర్ ట్యాంకు పనులు
- పైపులైన్‌కు ఏర్పాటుకు రోడ్డు విస్తరణ పనుల ఆటంకం

అసంపూర్తిగా వాటర్‌ట్యాంకు నిర్మాణం

చండూరు, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన పనులు మందకొడిగా సాగుతున్నాయి. చండూరు మునిసిపాలిటీలోని ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఈ పథకం రూ.9.80 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించడానికి గతేడాది ఆగస్టులో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. చేపట్టిన పనులు నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. పట్టణ ప్రజలకు తాగునీరు అందించడానికి 13 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేయాల్సి ఉంది. పైపులైన్లు కొంతమేర మాత్రమే వేసినా పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తంగా ఉండటంతో మిగతా పైపులైన్లు వేయడానికి ఆటంకంగా మారింది.

రూ. 9.80 కోట్లతో....

చండూరు పట్టణంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకంలో భాగంగా కేంద్రప్రభుత్వం నిధులు 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం నిధులు 30 శాతం, మునిసిపాలిటీ నుంచి మరో 20 శాతంనిధులు మొత్తం కలిపి రూ.9.80 కోట్లు మంజూరయ్యాయి. వీటితో 10 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన (ఒక్కోటి 5 లక్షల లీటర్లు) రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించనున్నారు. ఇవే కాకుండా అవసరం మేరకు పైప్‌లైన్లు వేయనున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఒకటి, అంగడిపేట రోడ్డులో మరొకటి ట్యాంకు నిర్మాణం చేపడుతున్నారు. ఇవేకాకుండా అవసరైన మేరకు పైపలైన్లు వేస్తున్నారు. తాగునీరు అందని ప్రతీ కుటుంబానికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోబోతున్నారు. ఇప్పటికే పట్టణంలో 11 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన 13 వాటర్‌ట్యాంకులు ఉన్నాయి. నూతన ట్యాంకులు, పాతవి కలుపుకుని మొత్తంగా 20 లక్షల లీటర్ల నీటిని పట్టణంలో సరఫరా చేయనున్నారు. పనులు పూర్తయితే పట్టణంలో నీటి సమస్య లేకుండా పోతుంది.

కాలనీల్లో నీటి సమస్య...

మునిసిపాలిటీ పరిధిలో 10వార్డులు ఉండగా, 13 వేలకు పైగా పట్టణ ఓటర్లు ఉన్నారు. సరైన ఓవర్‌హెడ్ ట్యాంకులు లేకపోవడం, మునిసిపాలిటీ పరిధిలోని చండూరు శివాజీనగర్, అండిపేట పరిధిలో ఉన్న అనేక కాలనీలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏడాది కాలంగా మంచినీరు సరఫరా లేదు. కాలనీ వాసులు ఎక్కువ భాగం మిషన్ భగీరథ నీటికి దూరంగా ఉండి, ప్యూరిఫైడ్ నీటిని కొనుగోలు చేసుకుని తాగుతున్నారు.

ఏడాదిగా తాగునీరు రావడం లేదు



ఏడాదిగా తాగడానికి నీరు సరిగా రావడం లేదు. పైపులైన్లు తరచుగా పగిలిపోతుండటంతో బురద నీరు వస్తుంది. వార్డు ఆఫీసర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. నీటి ట్యాంకుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలి.

\- ఇరిగి రామకృష్ణ, కాలనీవాసి

డిసెంబరులోగా పనులు పూర్తి



చండూరు మునిసిపాలిటీకి అమృత్ 2.0 పథకం కింద రూ.9.80 కోట్లు మంజూరయ్యాయి. ఒక్కో ట్యాంకు 5 వేల లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నాం. పైపులైన్లు కొంతమేర పూర్తి చేశాం. పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు మొదలుపెట్టాం. డిసెంబరులోగా పనులు పూర్తి చేసి, పట్టణంలో నీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

\- నాగప్రసాద్, ఏఈఈ, చండూరు

నడవాలన్నా నరకమే

● ప్రధాన రహదారిపై పారుతున్న మురుగునీరు



చండూరులో ప్రధాన రహదారిపై పారుతున్న మురుగునీరు, ఏర్పడిన గుంతలు

చండూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చండూరు మునిసిపాలిటీ ప్రధానచౌరస్తాలో మురుగు కాల్వ నుంచి నీరు లీకై ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. పట్టణంలో నాలుగు వరుసల రహదారి విస్తరణలో భాగంగా చేపడుతున్న రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం కోసం గుంతలు తవ్వారు. కొంతమేర సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినా మురుగు కాల్వల కోసం తవ్విన గుంతలను వదిలేశారు. పురాతనకాలంలో ఏర్పాటు చేసిన మురుగు కాల్వలు ధ్వంసం కావడంతో, కొత్తగా కాల్వల నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో మురుగునీరు ప్రధాన రహదారిపై చేరి కుంటలను తలపిస్తున్నాయి. రోడ్డుపై నడవాలన్నా నరకంగా మారింది. దోమలు, ఈగలు, దుర్వాసన వెదజల్లడంతో విషజ్వరాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల ఎదుట రెండు అడుగుల లోతు గుంతలు ఉండటంతో వినియోగదారులు ఎవరైనా వస్తే అందులో పడే ప్రమాదం ఉందని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, గుత్తేదారులు ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని దుకాణ యజమానులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీశైలం

చండూరురూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మండల పరిధిలోని నెర్మట గ్రామంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మండలంలోని ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వాలు నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఎన్నికల్లో భాగంగా ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, గ్రామాలకు లింకు రోడ్లు, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం యూరియా పంపిణీలో వివక్షత చూపిస్తుందని, ఇప్పటి వరకు కేవలం 50శాతం మాత్రమే యూరియా పంపిణీ అన్నారు. యుద్ధ ప్రాతిపదికన యూరియాను పంపిణీ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, నాయకులు ఈరటి వెంకటయ్య, బల్లెం స్వామి, నారపాక శంకరయ్య, కలిమెర సైదులు, ఈరగట్ల నరసింహ, కొత్తపల్లి వెంకన్న, బొమ్మరగోని యాదయ్య, లింగయ్య, నరసింహ, లక్ష్మమ్మ, రాములు, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

మునుగోడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇటీవల పాల్గొని హిందువుల మనోభావాలు దిబ్బతినే విధంగా చేసిన వ్యాఖ్యలు చేశారని, చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మునుగోడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానాయ్యయాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భవనం మధుసుదన్‌రెడ్డి, ఎం. నరేందర్‌గౌడ్, కర్నాటి లింగయ్య, రాజారామ్, పందుల యాదయ్య, శేఖర్, కొత్త శంకర్, చొల్లేటి బ్రహ్మచారి, దాం విష్ణు, నరసింహ, స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి కాళోజీ సేవలు చిరస్మరణీయం

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాష, యాసపై అనేక రచనలు చేసి ప్రజలను చైతన్య పరిచిన గొప్ప వైతాళికుడు కాళోజీ నారాయణరావు అని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బానోతు బాలమ్మ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా జిల్లా కేంద్రగ్రంథాలయంలో మంగళవారం తెలంగాణ భాష దినోత్సవం నిర్వహించారు. కాళోజీ కవితలు అన్యాయంపై అక్షర ఆయుధమైయ్యాయన్నారు. కార్యక్రమంలో లైబ్రయన్ కట్ట నాగయ్య కవులు, రచయితలు పున్న అంజయ్య, యాదగిరిరెడ్డి, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

కనగల్: కాళోజీ సేవలు చిరస్మరణీయమని నల్లగొండ ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో కాళోజీ జయంతి నిర్వహించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ పద్మ, డీటీ పార్వతమ్మ, ఆర్ఐలు సునిత, యాదగిరి, సీనియర్ అసిస్టెంటు విష్ణువర్ధన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు గోవర్ధనాభాయి, లతీఫ్, సరిత, పద్మ, అస్లం, లక్ష్మయ్య, రాంబాబు తదితరులున్నారు.

చండూరురూరల్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని బంగారిగడ్డ జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సాహితీ మేఖల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజీనారాయణరావు రచనలు ఆయన గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. సాహితీ మేఖల సభ్యులు మద్దోజు సుధీర్‌బాబు, డాక్టర్ నండూరి గోవిందరావు ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం పుస్తకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వేళాంగిణిమేరి, ఉపాధ్యాయులు కోడి అరుణ, మజీద్, నరసింహచారి పాల్గొన్నారు.

మర్రిగూడ: విద్యార్థులు మాతృభాష మీద మమకారం వదులుకోవద్దని మర్రిగూడ తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేష్‌గౌడ్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయంలో పాఠశాలలో మంగళవారం కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు భాష గొప్పతనం కాళోజీ భాషాభిమానం గురించి విద్యార్థులకు వివరించారు. కాళోజీ చేసిన సేవలను మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీటీ నిర్మల దేవి, సూపరింటెండెంట్ యాకూబ్ రవికుమార్, శ్రీనివాస్ నాయక్, రజాక్, సబితా, కర్నాకర్, భవాని, కోమలి, అనురాధ, లింగస్వామి, ఏడుకొండలు, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కనగల్‌లో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

కట్టంగూరు : కాళోజీ రచనల స్ఫూర్తితోనే తెలంగాణ సాకారమైందని ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీవో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ కోసం త్యాగం చేసిన మహనీయుడు కాళోజి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కడెం రాంమోహన్, మద్ది సులోచన, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రేషన్‌బియ్యంలో ఎన్నో పోషకాలు



డీలర్ దుకాణాలను తనిఖీ చేసిన డీటీ రఘునందన్

మర్రిగూడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రేషన్‌బియ్యంలో ఎన్నో పోషకాలు ఉన్నాయని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో మంగళవారం పౌరసరఫరాల దుకాణాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. రేషన్‌బియ్యంలో అక్కడక్కడ తెల్లగా ఉండే బియ్యం గింజలపై కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. అవి రబ్బర్ బియ్యం కాదని ఫోర్టిఫైడ్ బియ్యమని అవి ఇతర శరీరాలకు ఎంతో బలం, మేలు చేకూరుతుందని తెలిపారు. ఏ ఒక్కరూ ఈ బియ్యంపై అపోహల గురికావద్దని అన్నారు. అదేవిధంగా డీలర్లు సమయపాలన పాటించి లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేయాలని ఆయన సూచించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న మునిసిపల్ అధికారులు

రామగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన వంద రోజుల ప్రణాళిక మంగళవారం ముగిసింది. పట్టణంలోని రాంనగర్ మునిసిపల్ పార్క్‌లో మంగళవారం మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ రవీందర్‌రెడ్డి పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టితో పాటు వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం, మురుగుకాల్వల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇకపోతే అనధికారిక భవనాలను గుర్తించి భువన్ యాప్‌లో వివరాలు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. అక్రమంగా ఉన్న ట్రేడ్ లైసెన్స్‌లను, నల్లా కనెక్షన్లను గుర్తించి వాటిని క్రమబద్ధీకరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని నియంత్రించాలి

● సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి సాగర్

నల్లగొండరూరల్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీతో పాటు, మెడికల్ దందాను నియంత్రించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలోని శ్రామిక భవనంలో మంగళవారం నిర్వహించిన ప్రజాసంఘాల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులతో ప్రజలు అనారోగ్యానికి గురై, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తే రకరకాల టెస్టుల పేరుతో యథేచ్ఛగా అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి విచ్చల విడిగా, ప్రైవేట్ స్పత్రులు యాజమాన్యాలు రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనుమతులు లేని ఆస్పత్రి స్కానింగ్ సెంటర్లు, మెడికల్ షాపులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అధికారులు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రిలో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బీరెడ్డి సత్తిరెడ్డి, జిల్లా నాయకులు గజ్జి రవి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొంగరాల నరసింహ, బొమ్మిడి నగేష్, జిల్లా నాయకులు దాసరి నరసింహ, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మామిడోజు వెంకటేశ్వర్లు, నాయకులు బండారు వెంకన్న, నర్సయ్య, అయోధ్య, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి పోలే పవన్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలి

నల్లగొండ సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తకాలను గ్రంథాలయానికి తీసుకు రావద్దనే జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏబీవీపీ నాయకుడు హనుమాన్ డిమాండ్ చేశారు. ఎంజీయూలో ఏబీవీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం విద్యార్థుల చదువు, పరిశోధన కోసం ఏర్పాటైందని, తమ సొంత పుస్తకాలను, నోట్స్‌తో కూర్చోని చదవడానికి అవకాశం లేకపోతే గ్రంథాలయం ఏర్పాటు చేసిన ఉద్దేశ్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. విద్యార్థుల ఆస్తి దానిపై ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిచో తీవ్ర ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షుడు విజయ్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ మహేష్, సుధీర్, ఆకాష్, భాస్కర్, యువరాజు, ముకేష్, నాగరాజు, నవీన్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం



బూర నర్సయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నకిరేకల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమైన మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా కాసం వెంకటేశ్వ ర్లు, వేముల అశోక్, తులా వీరేందర్‌గౌడ్‌ను నకిరేకల్‌కు చెందిన బీజేపీ నాయకులు సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లో వారి నివాసాల్లో మర్యాదపూర్వకం గా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్స శ్రీనుగౌడ్, పబ్బు వెంకన్న, నీలం నాగరాజు పాల్గొన్నారు.

వారోత్సవాలను జయప్రదం చేయాలి

మునుగోడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. మునుగోడులో నాంపల్లి చంద్రమౌళి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయిలో మంగళవారం నిర్వహించిన సీపీఎం స్టడీ సర్కిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం రజాకార్లు, భూస్వామ్య పెత్తాందారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రజల హక్కులు, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు ప్రధానపాత్ర పోషించారని అన్నారు. సీపీఎం నాయకుల ఉద్యమాలను స్మరిస్తూ వారి త్యాగాలను కొనియాడారు. ఘన చరిత్ర ఉన్న తెలంగాణ సాయుధ రైతాంగపోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు చేయటం శోచనీయమన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కర్నాటి మల్లేశం, మునుగోడు, మంర్రిగూడ, చండూరు మండల పార్టీల కార్యదర్శులు సాగర్ల మల్లేష్, ఏర్పుల యాదయ్య, జెర్రిపోతుల ధనుంజయ్, మండల కమిటీ సభ్యులు మిర్యాల భరత్‌కుమార్, వరికుప్పల ముత్యాలు, కాంతయ్య, ముత్తిలింగం, వెంకటేశం, సుధాకర్, వల్లూరి శ్రీశైలం, అచ్చిని శ్రీను, శివ, యాదగిరి, రామలింగాచారి, నర్సింహ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

● అమ్మవారికి భక్తుల ప్రత్యేక పూజలు

కనగల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదిక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీర సారె, ఒడి బియ్యం బోన నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్య అర్చకుడు మల్లాచారి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి విశేష లంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి చంద్ర హారతులిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.



ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి (ఇన్‌సెట్‌లో) అమ్మవారికి చంద్రహారతినిస్తున్న అర్చకుడు మల్లాచారి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వెల్మకన్నె గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

గట్టుప్పల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్మకన్నె గ్రామంలో కింది కుంట మరమ్మతుల కోసం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో ఓఎన్ఎం నిధులు వ మంజూరు చేశారు. ఈ మరమ్మతులను మంగళవారం నాయకులు ప్రారంభించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే తనవంతుగా కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, ఉపాధ్యక్షుడు రావుల రమేష్, కాంగ్రెస్ పార్టీ సేవాదల్ జిల్లా అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డి, నాయకులు యాదగిరిరెడ్డి, మహేష్, పుల్లయ్య, శంకర్, వెంకటయ్య, నీటిపారుదల శాఖ ఏఈ భాగ్యలక్ష్మి, జశ్వంత్, లష్కర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.


సొసైటీల రద్దులో రాజకీయ కోణం!

(5వ పేజీ తరువాయి)

గడువు పెంపు కోసం ప్రయత్నాలు చేయాలని యోచిస్తున్నారు. ఇదిలావుంటే నల్లగొండ జిల్లాలో 22 సొసైటీలకు మాజీలకే బాధ్యతలు అప్పగించగా, దాదాపు 12 సహకార సంఘాలకు బుధవారం లేదంటే గురువారం స్పెషల్ ఆఫీసర్లను నియమించడానికి డీసీవో ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి. యాదాద్రి, సూర్యాపేట జిల్లాలో కూడా స్పెషల్ ఆఫీసర్ల నియామకానికి రంగం సిద్ధమవుతోంది.

మొత్తంగా ఉమ్మడి జిల్లాలోని మునుగోడు పీఏసీఎస్ మినహా మిగతా 107 సొసైటీలకు ఎంత మంది స్పెషల్ ఆఫీసర్లు ఉంటారు? ఎంత మంది మాజీ చైర్మన్లు, ఆయా సొసైటీల డైరెక్టర్లకు బాధ్యతలు అప్పగిస్తారనే విషయంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

సామాజిక రంగంలో సేవలకు శ్రీకాంత్‌కు డాక్టరేట్




శ్రీకాంత్‌కుమార్

నకిరేకల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవారంగంలో సేవలకు చేసిన సేవలకు మండలంలోని ఓగోడు గ్రామానికి చెందిన కందుకూరి శ్రీకాంత్‌కుమార్ డాక్టరేట్ పట్టా పొందారు. మాజిక్ ఆర్ట్స్ యూనివర్సిటీలో సామాజిక సేవపై అంకితభావంతో పనిచేసినందుకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్‌కుమార్ మాట్లాడుతూ తన తండ్రి సోమయ్య సేవా స్ఫూర్తితోనే తనకు డాక్టరేట్ లభించిందని తెలిపారు. రాబోయే రోజుల్లో సమాజానికి ఉపయోగపడే విధంగా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.5
కనిష్ఠం 23.4

ANDHRAJYOTHY



నల్లగొండ

5

బుధవారం 10 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.10 (309.3558)	70,769	70,769
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,424.06	1,711.69
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.423 (43.3532)	45,230	45,985

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

చచ్చి ఏం సాధిస్తాం

మార్పు తెప్పించిన మాటలు

సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన శ్రీనివాస్ అనే ఓ వ్యక్తి పలు వ్యాపారాలు చేశాడు. ఇందుకోసం అప్పులు తెచ్చాడు. వ్యాపారాల్లో నష్టం రావడంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. అందుకోసం క్రిమిసంహారక మందు తెచ్చుకున్నాడు. ఆ సమయంలో అతడి శ్రీనివా స్ మిత్రుడు వెంకన్న అతడి ప్రవర్తనను గమనించి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రశ్నించాడు. దీంతో తన బాధను పంచుకోవడంతో పాటు క్రిమిసంహారక మందు డబ్బాను చూపించాడు. శ్రీనివాస్‌ను ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లిన వెంకన్న సమస్యకు చావు పరిష్కారం కాదని, అప్పులను దశల వారీగా తీర్చుకోవాలని సూచించాడు. తననే నమ్ముకున్న కుటుంబాన్ని వదిలి వెళ్లాలనుకోవడం సరికాద ని, మంచి మాట లు చెప్పి అతడిలో ధైర్యాన్ని నింపాడు. దీంతో ఆత్మహత్య ఆలోచనను విరమించుకున్న శ్రీనివా స్ వ్యాపారాన్ని వృద్ధి చేసుకొని అప్పులు తీర్చుకుంటూ నేడు హాయిగా జీవిస్తున్నాడు. మిత్రుడు చెప్పిన మాటలు శ్రీనివాస్‌లో మార్పు తీసుకువచ్చాయి.



▸ ఆత్మహత్య వద్దు, ఆత్మస్థైర్యమే ముద్దు!

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇటీవల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. చిన్నచిన్న కారణాలకే ప్రాణాలను వదిలేస్తున్నారు. ఆర్థిక కారణాలతో పెద్దలు, ప్రేమ పేరుతో యువకులు బలవన్మరణాలను ఎంచుకుంటున్నారు. క్షణికావేశం, సమస్యలను ఎదుర్కొనే ఆలోచన నుంచి తప్పించుకునే క్రమంలో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఆందోళన, అవగాహన లోపంతో అనేకమంది మృత్యు మార్గాన్ని ఎంచుకుంటున్నారు. సమస్యలు తానొక్కడికే లేవని గుర్తించి అటుగా ఆలోచిస్తే జీవితం సుగమం అవుతుందని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. ఏ సమస్యలకైనా చావు పరిష్కారం కాదని, అలా అయితే సమాజంలో మిగిలేది సమాధులే అన్న సత్యాన్ని గుర్తించాలంటున్నారు. ఓటమి అనే సంద్రం నుంచి విజయ తీరా లకుచేరిన వారి కష్టాల కడలి పోరాటాన్ని తెలుసుకోవాలంటు న్నారు. రేపు అనేది మనదే అన్న ధీమాతో ఉండాలని, ఆ క్రమంలో ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏ సమస్యనైనా దీటుగా ఎదుర్కొనవచ్చని, చచ్చి కాదు, బతికి సాధించాలన్న తపనను మనలో పెంచుకోవాలని సూచిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి, సూర్యాపేట క్రైం)

• 6, 7లో..



కవి మాట....

మరణం వరించి వస్తే రమ్మంటాను....పాలుతాపి బజ్జోమంటాను అన్నాడు కవి డాక్టర్ సి.నారాయణ రెడ్డి. ఆత్మవిశ్వాసం ఉన్న మనిషి మృత్యువును ధీశక్తితో ఎదుర్కొంటే, అది లోపించిన మనిషి చావుకు భయపడతాడు.

సూర్యాపేట జిల్లాలో మూడేళ్లలో..

ఏడాది	ఆత్మహత్యలు
2023	141
2024	175
ఈ ఏడాది ఆగస్టు వరకు	115
మొత్తం	431

(ఈ ఏడాది జరిగిన సంఘటనల్లో 115 మంది ఆత్మహత్యలకు పాల్పడగా అందులో పురుషులు 54 మంది, మహిళలు 43 మంది, యువత 18 మంది ఉన్నారు.)



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాల ఆదాయం స్వల్పంగా పెరిగింది. అయితే రిజిస్ట్రేషన్ల తగ్గగా, ప్రభుత్వం భూముల విలువ పెంచడంతో ఆర్థికంగా కొంత పుంజుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు మొత్తం 153 రోజుల్లో రూ.158కోట్లకు పైగా రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం సమకూరింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

▸ స్వల్పంగా పెరిగిన రిజిస్ట్రేషన్లశాఖ ఆదాయం
▸ మందకొడిగా రియల్ వ్యాపారం
▸ ఈ ఏడాది ఆగస్టు వరకు రూ.158 కోట్లకు పైగా ఆదాయం

ఉమ్మడి జిల్లాలో రియల్ వ్యాపారం కొంత మందగించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 1,43,426 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరగ్గా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,38,729 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ మాత్రమే జరిగింది. అంటే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,699 డాక్యుమెంట్లు తక్కువగా రిజిస్ట్రేషన్ అయ్యాయి. దీం తో ఆదాయం స్వల్పంగా పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.412,36,58,581 ఆదాయం రాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.419,48,68,998 సమకూరింది. పెద్దగా ఖజానా నిండకపోయినా, గతంతో పోలిస్తే రూ.7,12,10,417 అదనపు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అత్యధికంగా...

- మిగతా 7వ పేజీలో...

అరకొరగానే ఆస్తుల క్రయవిక్రయాలు

ఉమ్మడి జిల్లాలో ఆస్తుల క్రయవిక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. వెంచర్లకు అన్ని అనుమతులు ఉన్నాయా? చెరువు శిఖాల్లో ఉన్నాయా? ప్రభుత్వ భూమినా? అసైన్డ్ భూమిలో వెంచర్లు ఏర్పాటు చేశారా? అని ప్రజల ఒకటికి రెండ్లు సార్లు విచారించి ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. ఇంటి స్థలాలు, అపార్ట్‌మెంట్ల ధరలు పెరిగాయి. దీంతో కూడా కొనుగోళ్లపై కొంత ప్రభావం కనిపిస్తోంది. ప్రభుత్వం మార్కెట్ ధరను కూడా పెంచింది. దీంతో స్టాంప్ డ్యూటీ పెరిగింది. ఈ నేపథ్యంలో ఆస్తుల కొనుగోలుదారులు కొనుగోళ్లకు, రిజిస్ట్రేషన్లకు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు కొనుగోళ్ల పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. లేఅవుట్లు సక్రమమా? అక్రమమా? అని అధికారులు నిర్ధారిస్తే రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ప్రజలకు పూర్తిస్థాయి నమ్మకం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం మరోమారు భూముల విలువలను పెంచే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. అయితే ఇప్పటి వరకు మార్గదర్శకాలు రాలేదని అధికారులు తెలిపారు. ఎనిమిది నెలల క్రితం వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్దగా లేకపోవడం ఆస్తుల క్రయవిక్రయాలపై ప్రభావం చూపింది. కరువు కూడా తోడవడంతో ప్రజల వద్ద డబ్బు లేక రియల్ వ్యాపారం దెబ్బతిన్నది. అయితే ప్రభుత్వం ఆ తరువాత 25శాతం రాయితీతో ఎల్‌ఆర్ఎస్ రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించడంతో చాలా మంది దీన్ని వినియోగించుకున్నారు. ఎల్‌ఆర్ఎస్ కారణంగా స్టాంపు డ్యూటీతో సంబంధిత శాఖకు కొంత కలిసి వచ్చింది.

పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పారదర్శకంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నాం. ఎలాంటి అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా జవాబుదారీతనంతో ఉండేలా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఎవరు కూడా మధ్యవర్తులను ఆశ్రయించకుండా సంబంధిత కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిచేయించుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం ఉంది. ఎవరికీ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు స్లాట్ బుకింగ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. సకాలంలో రిజిస్ట్రేషన్లు పూర్తి అవుతున్నాయి.

- ఎస్.ప్రకాశ్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

సొసైటీల రద్దులో రాజకీయ కోణం!

▸ బీఆర్ఎస్ నేతలు ఉన్న సొసైటీలను లక్ష్యంగా చేస్తున్నారని ఆరోపణలు
▸ సహకారశాఖ అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
▸ డిఫాల్టర్లపై దృష్టి సారించడం లేదన్న మాజీ చైర్మన్లు
▸ కోర్టు ఆశ్రయించనున్నట్లు సమాచారం
▸ డీసీసీబీ డైరెక్టర్లకు రాని అనుమతులు



నల్లగొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాల కాలపరిమితిని పొడిగించే విషయంలో పలు తిరకాసులు పెట్టడంతో రాజకీయ రచ్చ కొనసాగుతోంది. రాష్ట్రంలో మిగతా ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ల మాదిరిగానే ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌కు చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సొసైటీకి మాత్రమే పాలకవర్గ గడువును ప్రభుత్వం పెంచింది. మిగతా సొసైటీల విషయాన్ని డైలమాలో పెట్టింది. ఇటీవల జిల్లా సహకార శాఖ అధికారులు మూడు జిల్లాల్లో డిఫాల్టర్ సొసైటీల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. అయితే ప్రభుత్వం అనుమతిచ్చిన సొసైటీల చైర్మన్‌లను కొనసాగిస్తుండగా, మిగతా సొసైటీలకు నేడో, రేపో ప్రత్యేకాధికారులను నియమించే పనిలో డీసీవోలు ఉన్నారు. గతంలో జిల్లా సహకార ఎన్నికలు జరిగిన సమయంలో మూడు జిల్లాలోనూ అత్యధికంగా బీఆర్ఎస్ నేతలు కైవసం చేసుకున్న సొసైటీలు ఉన్నాయి. క్రమంగా చాలా సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లు అధికార పార్టీలో చేరారు. కొందరు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిఫాల్టర్ల సొసైటీలను పరిశీలిస్తున్న డీసీవోలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆయా సొసైటీల మాజీ చైర్మన్లు ఆరోపిస్తున్నారు.

డీసీవోలపై కొందరు ఎమ్మెల్యేల ఒత్తిళ్లు?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొన్ని సొసైటీలను కాపాడటం, మరికొన్ని సొసైటీలను రద్దు చేయించడం కోసం కొందరూ ఎమ్మెల్యేలు జిల్లా సహకార అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో డీసీవోలు డిఫాల్టర్ సొసైటీలను నిర్ణయించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. ప్రభుత్వ ఆదేశాలను సాకుగా చూపి ఒకరిద్దరూ డీసీవోలు ఏకంగా వారికి నచ్చని సొసైటీలపై ఏదో కారణం చూపి స్పెషల్ ఆఫీసర్లను నియమించే పనిలో ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో చాలా మంది సొసైటీల మాజీ చైర్మన్లు కోర్టును ఆశ్రయించేందుకు నిర్ణయించినట్టు సమాచారం. వీరంతా కోర్టులో పిల్ వేయనున్నట్టు వినికిడి. అదేవిధంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకులోని డైరెక్టర్ల కొనసాగింపునకు ఇప్పటి వరకు ఎలాంటి అనుమతి రాలేదు. వారంతా మాజీలుగానే ఉండిపోయారు. 18మంది వరకు డీసీసీబీ డైరెక్టర్లు మాజీలు కావడంతో వారందరిని ఎప్పుడు బాధ్యతల్లో కొనసాగిస్తారో తెలియని పరిస్థితి ఉంది. ఆగస్టు 14వ తేదీ నుంచి బాధ్యతలు ఇస్తూ పాలకవర్గాల గడువు పెంచినా ఇప్పటి వరకు వారికి చార్జ్ ఇవ్వకపోవడంతో పాటు చెక్‌పవర్‌ను కూడా నిలిపివేశారు. దీంతో వారంతా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పాలకవర్గాల..

- మిగతా 8వ పేజీలో...



స్నాతకోత్సవానికి సన్నాహాలు

▸ ఏ - ప్లస్ గ్రేడ్ వైపు ఎంజీయూ అడుగులు 7

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు
పూర్తి చేస్తాం

▸ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ▸ జలసౌధలో సమీక్షా సమావేశం
▸ పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా, మంత్రి కోమటిరెడ్డి



జలసౌధలో జరిగిన సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ సాగునీటి ప్రాజెక్టులను 2027 నాటికి పూర్తిచేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను 2027 నాటి వరకు పూర్తిచేస్తామని, అందుకు ఇరిగేషన్ అధికారులు పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాగునీటి పారుదలశాఖ మంత్రి కావడంతో జిల్లాకు మంచి రోజులు వచ్చాయని అన్నారు. అందుకే జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పనులన్నీ వేగవంతం అయ్యాయని అన్నారు. 2027 నాటికి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. గత పదేళ్ల కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును బీఆర్ఎస్ పక్కన పెట్టిందని ఆరోపించారు. సాగర్ బ్యాక్ వాటర్ విలువైనదని, ఈ నీరు ఎడమకాల్వ చివరి వరకు అందేలా లైనింగ్ పనుల కోసం టెండర్లు పూర్తిచేసినందుకు మంత్రి ఉత్తమ్‌కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో కట్టంగూరు, మునుగోడు, నార్కట్‌పల్లి మండలాల్లో వర్షాలు అతి తక్కువగా పడ్డాయని, దీంతో తాగునీటి సమస్య ఉందన్నారు. రైతులకు సాగునీరు అందించాలని పైపులైన్ కోసం తాను సొంతంగా రూ.30లక్షలు ఖర్చు చేశానని, ప్రభుత్వం రూ.300కోట్లు కేటాయిస్తే బ్రాహ్మణ వెల్లెంల నుంచి నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయవచ్చని అన్నారు. సాగునీటి బడ్జెట్‌లో 10శాతం నిధులు సుమారు రూ.3వేల కోట్లు ఖర్చు చేస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయని, అందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి వెంకట్‌రెడ్డి కోరారు.

జీవితాన్ని తెలంగాణకు అంకితం చేసిన ప్రజాకవి కాళోజీ

ఇన్‌చార్జి డీఆర్వో అశోక్‌రెడ్డి



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి డీఆర్వో అశోక్‌రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవితాన్ని తెలంగాణకు అంకితం చేసిన మహనీయుడు ప్రజాకవి కాళోజీ నారాయణ రావు అని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి, నల్లగొండ ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో కాళోజీ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు తన రచనల ద్వారా నిజాం నిరంకుశ పాలనను, దమన నీతిని ఎండగట్టారన్నారు. నిజాం రజాకార్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వతంత్ర్య సమరయోధుడు అని కొనియాడారు. అలాంటి మహనుభావుడి జయంతిని ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, ఆయా విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాలలో..

తెలంగాణ భాషా దినోత్సవాన్ని మంగళవారం నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన తెలుగు శాఖ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అక్షరాన్ని ఆయుధంగా చేసుకొని పోరాడిన కాళోజీ ప్రజాకవి అయ్యారని అన్నారు. కార్యక్రమంలో బట్టు కిరీటం, నర్సింగు కోటయ్య, ఎం.వెంకటరెడ్డి, కంబాలపల్లి శివరాణి, బొజ్జ అనిల్‌కుమార్, మల్లేశం, ఎం.సావిత్రి, గోవర్ధనగిరి, ప్రభాకర్, లింగస్వామి, భూపాల్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

యూరియా కష్టాలను తీర్చండి

మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే బీఎల్ఆర్ వినతి

మిర్యాలగూడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ రైతుల యూరియా కష్టాలను తొలగించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన కలిసి ఈ మేరకు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో రైతులకు కావల్సిన యూరియా అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. మంత్రి స్పందిస్తూ గురువారం వరకు రైతులకు కావల్సినంత యూరియా సమకూర్చుతామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుడుం అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన ఏఐసీటీయూ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం రైతులను ఇబ్బందులకు గురిచేసేలా లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.30వేలు చెల్లించాలని, ఈపీఎఫ్, పెన్షన్ రూ.15వేలు అమలు చేయాలని, మునిసిపాలిటీ, గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికుల కుటుంబానికి రూ.30లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 10 నుంచి 17 వరకు జరిగే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐసీటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కర్ర దానయ్య, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య, జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, పోతుగంటి కాశీ, మంద అనూక్, మోహన్‌నాయక్, జ్యోతి, శివ, ఆశీర్వాదం, వీరయ్య, కమలమ్మ, ఆదిలక్ష్మి, అనసూయ, సైదులు, నాగయ్య, మల్లేష్, పాల్గొన్నారు.

జిల్లా మత్స్యశాఖ ఇన్‌చార్జిగా రాజారాం

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్యశాఖ అధికారిగా యాదాద్రి జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం.రాజారానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు మత్స్యశాఖ అధికారిగా పనిచేసిన ఎం.చరిత అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. కాగా, ఇన్‌చార్జిగా నూతనంగా నియమితులైన రాజారాం బుధవారం బాధ్యతలు తీసుకోనున్నారు.



సైబర్ క్రైం
వలలో చిక్కి విలవిల

● ఉమ్మడి జిల్లాలో 6వేలకు పైగా కేసులు నమోదు
● రూ.53 కోట్లు రికవరీ! 6

ముత్యాలమ్మ ఆలయంలో మహాయజ్ఞం

దేవరకొండ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం మూడో వార్షికోత్సవం పురస్కరించుకొని మహాయజ్ఞం, పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్, నాయకులు నక్క వెంకటేష్‌యాదవ్, బెజవాడ శేఖర్, నేతాళ్ల వెంకటేష్‌యాదవ్‌తో పాటు ఆలయకమిటీ నిర్వాహకులు మహాయజ్ఞంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం

చింతపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశంలో సుస్థిర పాలన సాధ్యమవుతుందని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు అన్నారు. స్థానికుడైన డాక్టర్ కల్యాణ్‌నాయక్‌ను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడంతో మంగళవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ అన్నీవర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ నరేంద్ర మోదీ ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తున్నారన్నారు.

సాగుకు యూరియా కొరత

● ప్రాజెక్టులు నిండడంతో వరిసాగు ● యూరియా కోసం పీఏసీఎస్ కేంద్రాల వద్ద పడిగాపులు ● సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్


కొండమల్లేపల్లిలో మన గ్రోమోర్ కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు

దేవరకొండ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో యూరియా కొరత రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో ప్రాజెక్టులు నీటితో నిండిపోయాయి. డిండి, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులతోపాటు మండలాల్లోని గ్రామాల్లో బోరు బావుల కింద రైతులు అధికంగా వరిసాగు చేసుకున్నారు. దేవరకొండ డివిజన్‌లో ఈ వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు 4వేల టన్నుల యూరియా సరఫరా చేశామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా డివిజన్ పరిధిలోని పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులు యూరియాకోసం లైన్‌లో నిలబడి పడిగాపులు కాసే పరిస్థితి నెలకొంది. చందంపేట, పోలేపల్లి, దేవరకొండ, కొండమల్లేపల్లి, డిండి, తవక్లాపూర్ పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులు యూరియాకోసం బారులు తీరుతున్నారు. యూరియాకోసం టోకెన్లు తీసుకొని మూడు రోజులు గడుస్తున్నా యూరియా సరఫరా చేయడంలేదని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. డిండి ఆయకట్టు కింద మండలంలో 20వేల ఎకరాలు, పీఏపల్లి ఏఎమ్మార్పీ ప్రాజెక్టు కింద 30వేల ఎకరాల వరకు రైతులు వరిసాగు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో పత్తి సైతం డివిజన్‌లో ఏపుగా పెరిగింది. వరితోపాటు ఇతర పంటలకు కూడా రైతులు యూరియా వేసేందుకు సన్నద్ధమవుతున్నా యూరియా కొరత కారణంగా రోజుల తరబడి పీఏసీఎస్ కేంద్రాల వద్ద ఎదురు చూస్తున్నారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలే యూరియా సరఫరా చేస్తుండడంతో 10 ఎకరాలకుపైగా ఉన్న రైతులకు సరిపోవడంలేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ సీజన్‌కు సరిపడా యూరియా మొదటి విడత సరఫరా చేస్తూనే ఉన్నామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా, పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులు యూరియాకోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా సరిపడా సరఫరా చేయాలని రైతులతోపాటు వ్యవసాయ కార్మిక సంఘం నేతలు అధికారులను కోరుతున్నారు.

మూడు రోజులుగా తిరుగుతున్నా



ఈ సీజన్‌లో బోరుబావి కింద ఐదు ఎకరాల వరి సాగు చేశాను. యూరియా కోసం పోలేపల్లి పీఏసీఎస్ వద్దకు వెళ్లగా అందుబాటులోలేదని అధికారులు చెబుతున్నారు. టోకెన్ తీసుకొని మూడు రోజులవుతున్నా యూరియా సరఫరా చేయడంలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నాం. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదు.
సుందర్‌జీ, రైతు, పోలేపల్లి, చందంపేట మండలం.

సరిపడా యూరియా సరఫరా చేయాలి



రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి. యూరియాకోసం రైతులు ఉదయం నుంచే పనులు వదులుకొని పీఏసీఎస్ కేంద్రాల వద్ద పడిగాపుకాస్తున్నారు. రైతులకు సాగును బట్టి సరిపడా యూరియాను మంజూరు చేయాలి.
కంభాలపల్లి ఆనంద్, వ్య.కా.సం.నేత, దేవరకొండ.

కొరతలేకుండా చర్యలు తీసుకుంటున్నాం

దేవరకొండ డివిజన్‌కు సరిపడా యూరియా సరఫరా అవుతూనే ఉంది. రైతులందరికీ పీఏసీఎస్ కేంద్రాల ద్వారా యూరియా సరఫరా చేస్తున్నాం. రైతులు నిబంధనల ప్రకారం యూరియాను కొనుగోలుచేసి తీసుకెళ్లాలి. సమస్య ఉంటే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.
శ్రీలక్ష్మీ, ఏడీఏ, దేవరకొండ

యూరియా పక్కదారి..

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో యూరియా పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలరోజులుగా మండలకేంద్రంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో పంపిణీ చేయగా మండలంలోని కొంత మంది ప్రైవేటు డీలర్లు యూరియా బస్తాలను రైతులకు అందజేశారు. ఎవరు రైతులు, ఎవరు కూలీలు అని నిర్వాహకులు పరిశీలించకపోవడంతో బస్తాలు పక్క దారి పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఒక ఆధార్‌కార్డు ఉంటే చాలు.. యూరియా బస్తాలు దొరుకుతాయనే ఆలోచనతో కొందరు భూములు లేని రైతులు పదేపదే బస్తాలు తీసుకునేందుకు వరుసలో నిలబడుతున్నారు. వారికి భూమి ఎంత ఉంది?, ఇప్పటివరకు ఎన్ని బస్తాలు తీసుకున్నారు? అనే విషయాలను వ్యవసాయశాఖ అధికారులు, సింగిల్‌విండో సిబ్బంది పరిశీలించకపోవడంతో, నిజమైన రైతులకు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బ్లాక్‌లో విక్రయం

రూ.270 నుంచి రూ.280 వరకు ఒక యూరియా బస్తాను కొనుగోలు చేసిన కొందరు అధిక ధరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పేరు చెప్పడానికి ఇష్టపడని కొందరు రైతులు తాము ఫలానా వ్యక్తి నుంచి బస్తా యూరియాను రూ.500 నుంచి రూ.600కు కొనుగోలు చేసినట్లు వివరించారు.


క్యూలైన్‌లో నిల్చున్న రైతులు

సీతారాం ఆశయాలను సాధిస్తాం

● ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షుడు సీతారాం ఏచూరి ఆశయాలను సాధిస్తామని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మూడావత్ రవినాయక్ అన్నారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'తెలంగాణ సాయుధ పోరాటం-వాస్తవాలు- వక్రీకరణలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల నాయకత్వంలో 10వేల ఎకరాల భూమిని పేదలకు పంచి, 4వేల గ్రామస్వరాజ్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ పోరాటంలో ఏఒక్క రోజు పాల్గొనని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు ఢిల్లీస్థాయిలో వక్రీకరణకు పాల్పడుతున్నట్లు చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కీర్తించేలా ఈ నెల 10 నుంచి 17వరకు నిర్వహిస్తున్న వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌నాయక్, సైదానాయక్, నాగేశ్వరావు పాల్గొన్నారు.

వారోత్సవాలను విజయవంతం చేయాలి

దేవరకొండ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 11 నుంచి జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి కోరారు. మంగళవారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన సీపీఐ నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, తూం బుచ్చిరెడ్డి, మైనొద్దిన్, దేప సుదర్శన్‌రెడ్డి, కనకచారి, రామస్వామి, రంగారెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

● దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్

దేవరకొండ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మెప్మా ద్వారా ఉపాధి పొందిన మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ కోరారు. మంగళవారం దేవరకొండ మునిసిపాలిటీలో వంద రోజుల పట్టణ ప్రణాళికలో భాగంగా స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడు రకాల స్టాళ్లలో వివిధ రకాల తినుబండారాలను తయారుచేసి విక్రయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్‌గౌడ్, మునిసిపల్ మేనేజర్ రాకేష్, శక్రునాయక్, మెప్మా, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ రీఫిల్లింగ్ చేయడం నేరం

చింతపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్యాస్‌ను అక్రమంగా పెద్ద సిలిండర్ నుంచి చిన్న సిలిండర్లకు రీఫిల్లింగ్ చేయడం నేరమని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ అన్నారు. మంగళవారం చింతపల్లి మండలం గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్(మాల్)లో పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు అందించకుండా కొంత మంది డీలర్లు కిరాణ దుకాణాలకు సరఫరా చేస్తున్నారని, ఇది సరికాదని, అలా చేస్తే డీలర్‌షిప్ రద్దు చేస్తామన్నారు.

భాస్కర్ మరణం తీరనిలోటు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు దండ భాస్కర్ మరణం తీరని లోటని ఎన్‌బీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నల్లమోతు సిద్దార్థ అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన భాస్కర్ కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధితోపాటు సమస్యల పరిష్కానికి మీడియా ప్రతినిధులు చేస్తున్న కృషి గొప్పదన్నారు. భాస్కర్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు సహకారంతో అండగా ఉంటామన్నారు. తక్షణసాయంగా రూ.50వేలను భాస్కర్ భార్యకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్నాటి జానకిరెడ్డి, పశ్యా శ్రీనివాసరెడ్డి, ఎండీ. షోయబ్, రెడబోతు సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అనేక ప్రయోజనాలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న సరిత

హాలియా, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో అనేక ప్రయోజనాలున్నాయని మండల సహాయ వ్యవసాయ సంచాలకులు ఎమ్.సరిత, మండల వ్యవసాయాధికారి మునికృష్ణ అన్నారు. మంగళవారం నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నానో యూరియా మొక్కలకు సమర్థవంతంగా నత్రజనని అందిస్తుందని, పంట దిగుబడిని పెంచడంలో సహాయపడుతుందన్నారు. సంప్రదాయ యూరియా వాయువుగా మారి వాతావరణంలోకి విడుదలై పర్యావరణానికి హాని చేస్తుందని, భూగర్భజల వనరులకు ఇబ్బంది కలగడమే కాకుండా నేలకు కూడా చాలా నష్టం కలిగిస్తుందన్నారు. నానో యూరియా ద్రవరూపంలో ఉండడంతో రవాణా, నిల్వ చేయడం సులభతరమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్‌గా అశోక్

హాలియా, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ సేన జిల్లా నూతన కన్వీనర్‌గా అనుముల మండలం వీర్లగడ్డతండాకు చెందిన నేనావత్ అశోక్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబురావునాయక్ అధ్వర్యంలో అశోక్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. ఈ సంద్భంగా అశోక్‌నాయక్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు కావస్తున్నా నేటికీ జిల్లాలో వేలాదిమంది గిరిజనులకు కనీసం కూడు, గూడు, నీడ లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

● మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు ● ఎస్‌జీఎఫ్ నియోజకవర్గస్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. మంగళవారం అవంతీపురం గురుకుల పాఠశాలలో స్కూల్ గ్రేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గస్థాయి క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనన్నారు. వాటిని అధిగమించి క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడలతో జీవితంలో క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ దగ్గుపాటి విమల మాట్లాడుతూ జిల్లాలో ప్రథమంగా నియోజకవర్గస్థాయి క్రీడలను నిర్వహిస్తున్నందుకు వ్యాయామ ఉపాధ్యాయులను అభినందిస్తున్నట్లు చెప్పారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజన వసతి, బహుమతులను సమకూర్చిన ఎమ్మెల్యే బీఎల్ఆర్‌కు విద్యార్థుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఎస్‌జీఎఫ్ కో కన్వీనర్ శోభారాణి మాట్లాడుతూ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు టీమ్ స్పిరిట్‌ను, ఆట నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. క్రీడోత్సవాల నిర్వహణకు ప్రోత్సాహన్ని అందించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. మండల విద్యాధికారి లావూరి బాలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మిర్యాలగూడ తహసీల్దార్ సురేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పి. సైదులు, మనోహరి, వెంకటయ్య, ఎండీ షాహీద్, యుగందర్ రెడ్డి, వెంకటరెడ్డి, రవిందర్, అరుణమ్మ, ఇందిర సావిత్రి, నాగలక్ష్మి, అనిల్, జోజి తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిల్వలపై విచారణ జరిపించాలి

● కలెక్టర్‌కు వినతి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియా అక్రమ రవాణా, నిల్వలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల అజయ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం సరఫరా చేసిన యూరియాను పక్కదారి పట్టించడం, అధిక ధరలకు విక్రయించడం సరికాదన్నారు. రైతు అవసరాలను ఆసరాగా చేసుకుని సీజనల్ వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పీఏసీఎస్ ద్వారా యూరియా పంపిణీ జరిగితే అక్రమాలకు తావుండదన్నారు. జిల్లాలో జరిగిన యూరియా అక్రమ నిల్వ, అధిక ధరలకు విక్రయ ఘటనలు వెలుగు చూసిన నేపథ్యంలో కలెక్టర్ ఇలాత్రిపాఠికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం, భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు పాల్గొన్నారు.

సాంబయ్య కుమార్తెను ఆదుకోవాలి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమకాల్వలో పడి మృతి చెందిన పున్న సాంబయ్య కుమార్తె నిత్యను ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆగా మోత్కూరు గ్రామానికి చెందిన పున్న సాంబయ్య, అతని కుమారుడు శివమణిలు గణపతి నిమజ్జన కార్యక్రమంలో కాల్వలో కొట్టుకుపోయి మృతి చెందడం బాధాకరమన్నారు. చిన్నతనాన తల్లిని కోల్పోయిన నిత్య.. తండ్రి, సోదరుడు మృతి చెందడంతో ఒంటరి అయిందన్నారు. గురుకులంలో విద్యనభ్యసిస్తున్న నిత్య భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఆదుకోవాలని సచివాలయలంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సుల్తానియాకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనం


మంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

దేవరకొండ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలను గౌరవించకుండా ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ దేవరకొండలో బీజేపీ నేతలు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కర్నాటి సురేష్, పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సందర్భంగా నల్లగొండలో జరిగిన సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన రాజకీయ ప్రసంగం చర్చనీయాంశమైందన్నారు. ఇదేమిటని ప్రశ్నించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డిని అరెస్టు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బెజవాడ శేఖర్, గుండాల అంజయ్య యాదవ్, రవికుమార్, సహాదేవుడు, బిక్కునాయక్, శంకర్, చండీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ బాటలో పయనించాలి

● తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్రనేత హరికృష్ణ


మిర్యాలగూడలో కాళోజి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాళోజీ బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు హరికృష్ణ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా స్థానిక విజేత డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ నేను ప్రస్తుతాన్ని, నిన్నటి స్వప్నాన్ని, రేపటి జ్ఞాపకాన్ని అని కాళోజీ ప్రకటించుకున్నారన్నారు. తన ఆలోచనలకు అక్షర రూపం ఇవ్వడం, నమ్మిన దానికోసం తెగించి పోరాడటం, తెలిసిన దాన్ని నలుగురికి చెప్పి ఒప్పించడం ఆయన నైజం అన్నారు. ఆయన కలలను సాకారం చేసే దిశగా తెలంగాణ సమాజం నడవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ, వైస్ ప్రిన్సిపాల్ మధు, పారామెడికల్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, చారీ, యాదయ్య, దుర్గయ్య, హరి, రాజారాం, ప్రభాకర్, జ్యోతి, సైదమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మల్గిరెడ్డి భీమార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ప్రముఖ కవి, మానవతావాది, సంస్కృతీ సంప్రదాయాల విస్తరణకు వారధి అయిన కాళోజీ నారాయణరావు జయంతి రోజును తెలుగు భాషాదినోత్సవంగా జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకుడు డాక్టర్ నరేష్ గుమ్మడి, వెంకటరమణ, నాగరాజు, అశ్విని, దుర్గాభవాని, శ్రీవేణి, ఆసీన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రవీంద్రభారతి పాఠశాలలో నిర్వహించిన కాళోజీ జయంతి సభకు బీసీ జేఏసీ నేత చేగొండి మురళీయాదవ్, మధుసూదన్‌రెడ్డి, స్వరాజ్యం తదితరులు హాజరయ్యారు.

నాగార్జునసాగర్: ప్రముఖ కవి కాళోజీ జయంతి వేడుకలను సాగర్ బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో, బీసీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ రవి కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు లలిత, కృష్ణ, ప్రిన్సిపల్‌లు మాధవిలత, రవికుమార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

చింతపల్లి: కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకొని మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్) జడ్పీహెచ్ఎస్‌లో నివాళి అర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి, ఎండీ అన్వర్, పీఆర్‌టీయూ నాయకుడు సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కాళోజీ నారాయణరావు జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది ప్రవీణ్, లక్ష్మణ్, ఆంజనేయులు, రాంరెడ్డి, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ చరిత్రలో నెత్తుటి గుర్తు

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నాటి తెలంగాణ మట్టి మనుషుల పోరు ప్రపంచ చరిత్రలో నెత్తుటి గుర్తుగా మిగిలిందని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వన్‌టౌన్, టూటౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగించిన వీరోచిత పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు చాటేందుకు సీపీఎం ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాలను సెప్టెంబరు 10నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11న గూడూరు గ్రామంలో కార్యక్రమానికి పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం హాజరవుతారన్నారు. 17న నల్లగొండలో జరిగే వారోత్సవాల ముగింపు సమావేశానికి పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్ హాజరువుతారన్నారు. సమావేశంలో నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మూడావత్ రవినాయక్, ఆయూబ్, మల్లుగౌతంరెడ్డి, బావాండ్ల పాండు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణరావు పాల్గొన్నారు.

సీపీజీఈటీలో సాగర్ విద్యార్థులకు ర్యాంకులు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ వెల్లడించిన కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ (సీపీజీఈటీ) ఫలితాల్లో సాగర్ బీసీ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీలో రమేష్ 24వ ర్యాంకు, ఫిజిక్స్‌లో రంగా 223వ ర్యాంకు, జియాలజీలో మనోహర్ 10వ ర్యాంకు, కెమిస్ట్రీలో గణేష్ 5వ ర్యాంకు, హెచ్‌ఆర్ఎంలో శివ 174వ ర్యాంకు సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీలో సీట్లు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ మాదవీలత, అధ్యాపకులు అభినందించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


వేములపల్లిలో మాట్లాడుతున్న హేమలత

వేములపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా నియమించిన గ్రామ పరిపాలన అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని తహసీల్దార్ హేమలత అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా విధుల్లో చేరిన గ్రామ పాలన అధికారులతో సమావేశం నిర్వహించి అందించాల్సిన సేవలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కోటీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని ఆరు క్లస్టర్లకు ఆరుగురు గ్రామపాలన అధికారులను నియమించినట్లు తహసీల్దార్ నరేందర్ మంగళవారం తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు జీపీలోను నియమించినట్లు వివరించారు.

సొసైటీల రద్దులో
రాజకీయ కోణం!

(5వపేజీ తరువాయి)

గడువు పెంపు కోసం ప్రయత్నాలు చేయాలని యోచిస్తున్నారు. ఇదిలావుంటే నల్లగొండ జిల్లాలో 22 సొసైటీలకు మాజీలకే బాధ్యతలు అప్పగించగా, దాదాపు 12 సహకార సంఘాలకు బుధవారం లేదంటే గురువారం స్పెషల్ ఆఫీసర్లను నియమించడానికి డీసీవో ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి. యాదాద్రి, సూర్యాపేట జిల్లాలో కూడా స్పెషల్ ఆఫీసర్ల నియామకానికి రంగం సిద్ధమవుతోంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలోని మునుగోడు పీఏసీఎస్ మినహా మిగతా 107 సొసైటీలకు ఎంత మంది స్పెషల్ ఆఫీసర్లు ఉంటారు? ఎంత మంది మాజీ చైర్మన్‌లు, ఆయా సొసైటీల డైరెక్టర్లకు బాధ్యతలు అప్పగిస్తారనే విషయంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : వార్-2, వెంకటేశ్వర: మహావతార్ నరసింహ రాఘవ: కూలీ, విట్రోస్: కూలీ, పరదా, బన్ బటర్ జామ్ దేవరకొండ : మనోజ్ : వార్ 2 మైత్రి వెంకటేశ్వర : మహా అవతార్ నర్సింహ